విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శనివారం 31 మే 2025 8 పేజీలు

నత్తనడకన పనులు

- నిర్మాణ ఏజెన్సీ, అధికారులపై మంత్రి నిమ్మల తీవ్ర ఆగ్రహం
- ఏజెన్సీకి వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశం...
- పనులు పరిశీలించిన మంత్రి

విశాలాంధ్ర-విజయవాడ: గతంలో బుడమేరు వరదకు పడిన మూడు గండ్లను కలుపుతూ నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు నత్తనడక సాగడంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మూడు సార్లు స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి, సీజన్ మొదలయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పనులు నెమ్మదించడంతో ఏజెన్సీకి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, సిఈ సుగుణాకరరావులతో కలసి పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. గతేడాది వచ్చిన బుడమేరు వరదల వల్ల విజయవాడ తీవ్ర ముంపుకు గురైందని, ఆగండ్లను పూడ్చడానికి గట్లపైనే ఉండి రాత్రింబవళ్ళు పనిచేశామని, స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం పది రోజులు బస్సులోనే ఉండి పర్యవేక్షించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం గతంలో పడిన మూడు గండ్లను కలుపుతూ శాశ్వతప్రాతిపదికన సిసి వాల్ నిర్మాణం కొరకు రూ 23 కోట్లు అగ్రిమెంట్ వాల్యూతో టెండర్లు పిలిచి పనులు కూడా చేపట్టడం జరిగిందని స్పష్టం చేశారు. ఐతే పనులు నెమ్మదిగా సాగుతుండటం, సరిపడినంత మెషినరీగానీ, సిబ్బంది గానీ లేకపోవడంతో ఏజెన్సీ, అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండేలా పనులు పూర్తి చేయడానికి వీలుగా సరిపడినంత మెషినరీ, సిబ్బంది గానీ సమకూర్చుకుని మూడు షిఫ్ట్‌లలో, రాత్రి పగలు, పనులు చేయాలని ఆదేశించారు. వర్క్ షెడ్యూల్‌ను రోజువారీ వేసుకుని, ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

గుంటూరు ఛానల్‌పై నిర్లక్ష్యం తగదు

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి

విశాలాంధ్ర-మంగళగిరి : గుంటూరు ఛానల్ పట్ల దశాబ్దాల కాలంగా పాలకులు, అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, దీనివలన రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ నాయకులు సంయుక్తంగా శుక్రవారం చినకాకాని గ్రామంలోని గుంటూరు ఛానల్ వంతెన, కాలువను సందర్శించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ 1966లో గుంటూరు ఛానల్ కాలువను నిర్మించారని తెలిపారు. విజయవాడ నుంచి పొన్నూరు, ప్రత్తిపాడు, మంగళగిరి నియోజకవర్గాలలో సుమారు 47 కిలోమీటర్ల వైశాల్యం లో ఇది విస్తరించి ఉందని తెలిపారు. 30 గ్రామాల ప్రజలకు తాగునీరు, 30 వేల ఎకరాలకు సాగునీరు ఈ గుంటూరు ఛానల్ ద్వారా -మిగతా 2 లో ...

ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర కమ్యూనిస్టులదే 8

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ : కమిషనర్ 2

నిబంధనలకు నీళ్లు

ఇరుకు సందులుగా పట్టణ రహదారులు

విశాలాంధ్ర -నందిగామ: అక్రమ కట్టడాలకు అడ్డగా నందిగామ తయారయ్యిందని పలువురు ఆరోపిస్తున్నారు. దానికి కారకులు టౌన్ ప్లానింగ్ అధికారులు అంటున్నారు. పట్టణ ప్రజలు చిన్న, సన్నకారు గృహాలు నిర్మించుకుంటే వారిపై అనేక నిబంధనలు చూపిస్తూ వారి నిర్మాణాలకు ఆటంకాలు కలిగించే సదరు అధికారులు పెద్ద బిల్డింగులు నిర్మాణాలు చేపట్టేవారికి నియమ నిబంధనలు వర్తించవా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ పరిధిలో నిర్మాణాలు చేసే వాళ్ళందరికీ ఒకే రూల్స్ ఉండాలి, ఉన్నవారికి ఒక రూల్, లేనివారికి మరొక రూల్స్ చెబుతూ వారి యొక్క చేతివాటాన్ని చూపిస్తున్నారు. అడిగినంత ముడుపులు ముట్టచెబితే ఆగ మేఘాల -మిగతా 2 లో ...

తెలుగు కీర్తిని దశదిశలా వ్యాప్తి చేయాలి

▪ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ▪ ముగిసిన గ్రంథాలయ వర్క్‌షాపు

విశాలాంధ్ర-విజయవాడ: మాతృ భాషను తెలుగు వారి కీర్తిని దశదిశలా వ్యాప్తి చేయాలని, నిరంతర పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం అందుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా సూచించారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంస్థ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, స్వేచ్ఛ ఆంధ్ర సంయుక్త నిర్వహణలో 11 రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. చక్కని ప్రతిభ కనపర్చిన చిన్నారులకు ధృవీకరణ పత్రాలు పుస్తకాలు జ్ఞాపకాలుగా అందజేశారు. ముగింపు -మిగతా 2 లో ...

గృహ నిర్మాణ పురోగతిపై సమీక్ష

విశాలాంధ్ర -బ్యూరో మచిలీపట్నం : నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ గృహ నిర్మాణ పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణంలో కృష్ణాజిల్లా చాలా వెనుకబడి ఉందని, గత 15 రోజుల కిందట నుంచి చాలా మండలాల్లో అనుకున్న స్థాయిలో పురోగతి లేదని, ఈ నెల 13 సమీక్షలో 910 గృహాలను పూర్తి చేయా లనే లక్ష్యంగా పెట్టుకున్నప్పటికి కేవలం 412 మాత్రమే పూర్తి చేశారన్నారు. మచిలీపట్నం టౌన్, అవనిగడ్డ, కోడూరు, గన్నవరం, -మిగతా 2 లో ...

నిబంధనలకు నీళ్లు (మొదటిపేజీ తరువాయి)

మీద ప్లానింగ్ అప్రూవల్ అందుతుందని, ఎవరైనా అదిగినంత ఇవ్వకపోయినా లేదా రూల్స్‌ను ప్రశ్నించిన వారి ప్లానింగ్ మాత్రం నెలలు గడుస్తున్న కార్యాలయం నుంచి బయటకు రాదు అంటు ప్రజలు వాపోతున్నారు. ఒకవైపు భారీ నిర్మాణాలు చేస్తుంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేస్తారు. కానీ చర్యలు వుండవు. పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారులు చేతివాటం వలన పట్టణంలో రోడ్లన్నీ ఇరుకు సందులుగా మారిపోయాయి పెద్ద పెద్ద వాహనాలు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితుల్లో పట్టణంలో రోడ్లు తయారయ్యాయి. దీనికి ముఖ్య కారకులు టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటాలు అని ప్రజలు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనాప్పటికీ నందిగామ పట్టణంలో నిర్మాణం అవుతున్న నిర్మాణం కోసం అప్రూవ్ పొందిన ప్రతి ఒక్కరికి పట్టణ ప్లానింగ్ వివరాలను అందించి దాని కనుగుణంగా నిర్మాణాలు జరిపితేనే ముమ్ముందు పట్టణ అభివృద్ధికి దోహదపడతాయి. ఎన్టీఆర్ రోడ్‌లో నిర్మాణం అవుతున్న ఐదు అంతస్తుల భవనానికి రోడ్డు వైండింగ్ కింద మున్సిపాలిటీకి అందించవలసిన స్థలాన్ని ఇవ్వకుండానే వారు నిర్మాణాలు చేస్తున్నారు, ఖుషి కాలేజ్ రోడ్డులో మరో ఐదు అంతస్తుల భవనం అక్రమ నిర్మాణం జరుగుతుంది. అదే కాకుండా జి ప్లస్ త్రీ అనుమతి ఉన్న పట్టణంలో ఐదు అంతస్తుల భవనాలు యదేచ్ఛగా అక్రమ నిర్మాణదారులు నిర్మాణాలు చేస్తున్నారు. నందిగామ శాసనసభ్యురాలు కార్యాలయానికి వెళ్ళే రహదారిలో నిర్మాణం అవుతున్న బిల్డింగ్ రోడ్డుకు అందించ వలసిన స్థలాన్ని అందించకుండానే నిర్మాణాలు చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు వారికి పర్మిషన్‌లు అందించారు. కొన్ని సందర్భాల్లో శాసనసభ్యురాలు కార్యాలయానికి అత్యవసరంగా ముఖ్యులు వస్తున్న సందర్భంలో రోడ్డుపై ఎదురుగా వాహనం వస్తుంటే తప్పుకోలేని పరిస్థితి ఉంది. ముమ్ముందు రోజుల్లో నందిగామ శాసనసభ్యురాలుకు ప్రత్యేక హోదా లభించే అవకాశం ఉన్న నేపథ్యంలో నందిగామ శాసనసభ్యురాలు కార్యాలయం నుండి ప్రభుత్వ ఎస్కార్ట్‌లు వెళ్ళవలసి ఉంటుంది అనేక పనులుపై కార్యాలయానికి వచ్చేవారు వస్తూపోతూ ఉంటారు. వారికి ఇబ్బందులు తప్పే పరిస్థితి లేవని ప్రజలు చెప్పకనే చెబుతున్నారు ఏది ఏమైనప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం పట్టణంలో పలు రహదారులను ఇరుకు సందులుగా మార్చే అవకాశం మాత్రం స్పష్టంగా కనబడుతుంది. కొందరు మధ్యవర్తుల ద్వారా టౌన్ ప్లానింగ్ అధికారుల రాయబారాలను ప్రజలు బాహాటంగా పలువురికి విన్నవించుకోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

అధికారుల వివరణ : సదరు విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారులను సంప్రదించడానికి ట్రై చేస్తే వారు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం విశేషం సదరు మున్సిపల్ కమిషనర్‌ను ఇదే విషయంపై గతంలో సంప్రదించగా అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై సంబంధిత శాఖ ద్వారా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

పురోగతిపై సమీక్ష (మొదటిపేజీ తరువాయి)

చల్లపల్లి, పెదపారుపూడి, కృత్తివెన్ను, మోపిదేవి, గుడివాడ, నాగాయ లంక మండలాలు పురోగతిలో చాలా వెనుకబడ్డాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో లింటర్ స్థాయిలో 8,108, ఆర్‌ఎల్ స్థాయిలో 2,148, ఆర్‌సి స్థాయిలో 588 ఇళ్ళు ఉన్నాయని, వీటిలో ఆర్‌ఎల్ స్థాయిలోని ఇళ్లు ఆర్‌సి స్థాయికి, ఆర్సి స్థాయిలో ఉన్న ఇళ్లు నిర్మాణం వచ్చే సమావేశం నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తికావాలన్నారు. వచ్చే సమావేశం మరల జూన్ 13న నిర్వహిస్తామని, ఆ తేదీ నాటికి పనితీరు మార్చుకొని సరైన పురోగతి చూపని క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు బాధ్యులైన వారు ఎవరైనా ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్‌తో సహా అందరిని సస్పెండ్ చేస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. గృహ నిర్మాణంలో పురోగతి చూపని వారిపై ఉదాసీనత వైఖరి పనికిరాదని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనుటకు సంబంధిత దస్త్రాలను పంపించాలన్నారు. ఎంపిడిఓలు కొందరు క్షేత్రస్థాయిలో సమీక్షలు చేయకపోవడం సరైంది కాదని, గృహనిర్మాణంలో గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శుల సేవలను వినియోగించుకోవాలని ఉన్నతాధికారి నుండి ఆదేశాలు వచ్చాయన్నారు. గడువు పూర్తయినప్పటికి భారత ప్రభుత్వం మరల పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చిందని, ఆవిషయం లబ్ధిదారులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందజేసేందుకు గత మార్చి 25న ఉత్తర్వు లిచ్చినప్పటికి ఆ విషయం చాలా చోట్ల లబ్ధిదారులకు తెలియజేయకపోవడం సరైనది కాదని, గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. జూన్ 1ఆదివారం సెలవు అయినందున ఈ నెల 31న శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు సజావుగా చేయాలని జిల్లా కలెక్టర్ బాలాజీ ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకట్రావు, టిడ్కో ప్రాజెక్ట్ డైరెక్టర్ చిన్నోడు, మచిలీపట్నం, పెడన, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, గోపాలరావు, వెంకటేశ్వర రావు, మండల ప్రత్యేక అధికారులు జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద కుమార్, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, మత్స్యశాఖ జెడి. నాగరాజు, పలువురు ఎంపీడీఓలు, గృహ నిర్మాణ సంస్థ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ : కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఓటరు నమోదు నిరంతర ప్రక్రియగా జరుగుతుం దాలని సెంట్రల్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకనుగుణంగా ప్రతి ఏఈఆర్‌వో తన పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఉన్న కాలేజీల్లో ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ప్రతిరోజు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని అధికా రులను ఆదేశించారు. నమోదైన ప్రతి ఒక్కరికి పీ.వీ.సీ ఓటర్ కార్డ్ వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈఆర్‌వోల పర్యవేక్షణలో ప్రతి బిఎల్ఓ ప్రతి వీధిలోని డోర్ నంబర్లలో ఉన్న ప్రజలను పూర్తిగా సర్వే చేసి వారికి ఉన్న పోలింగ్ కేంద్రాలు కూడా ఒకే చోట ఉన్నాయా లేదా వంటి విషయాలపై నిర్ధారించుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు నరహరిశెట్టి నరసింహారావు (కాంగ్రెస్), ఎన్. వీరభద్రరావు (సీపీఐ), ఎం.బాబు రావు (సీపీఎం), తరుణ్ కాకాని (బీజేపీ), ఎన్.సాంబ శివరావు (టీడీపీ), సుందర్‌పాల్ (వైసీపీ), ఏఈఆర్‌ఓలు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ కే.ప్రభుదాస్, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం

విశాలాంధ్ర-పెదపారుపూడి : స్థానిక ఎంపీడీవో గా 2025 మే నెల 5న బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ సాదిక్ శనివారం 31న ఉద్యోగ విరమణ చేయబోతున్న సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆఫీస్ సిబ్బంది శాలువాలతో, పూలమాలలతో శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షహనాజ్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ (వంశి), ఏవో విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎస్ కె బేగం, జూనియర్ అసిస్టెంట్ డి స్వరూప్ కుమార్, టైపిస్ట్ కే ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శులు సాగర్ రాణి, దయామణి, కృష్ణవేణి, బాబు రాజేంద్రప్రసాద్, షరీఫ్, లావణ్య, పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : తెనాలి బార్ అసోసియేషన్ న్యాయవాది జాన్ విక్టర్‌పై పోలీసుల చట్ట వ్యతిరేక చర్యలను ఖండిస్తూ... జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, నిరసన చేపట్టారు. న్యాయవాదులు మాట్లాడుతూ 'న్యాయవాదుల రక్షణ చట్టం' అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అన్నెపాగ సుందరరావు, శ్యామల నరసింహ రెడ్డి, ఎం ఆంజనేయులు, రావూరి ప్రసాద్, కే.ప్రతాప రెడ్డి, అశోక్ , నరేష్, చిన్న గాంధీ, అంకమ్మ రాజు, భిక్షమయ్య, రాజశేఖర్, రవి పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ

విశాలాంధ్ర-ఉయ్యూరు : జూన్ 1 నుంచి చౌకధరల దుఖాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ ఎం. సురేశ్ కుమార్ తెలిపారు. చౌ కధరల దుఖాణంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయాలు, డీలర్ పేరు, ఫి ర్యాదులు చేసే ఫోన్ నంబర్లు ఇతర వివరాల బోర్డును కడవకొల్లు వీరవల్లి మొఖాసా దుఖాణంలో శుక్రవారం ఏర్పాటు చేశారు.

వ్యాప్తి చేయాలి (మొదటిపేజీ తరువాయి)

సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు భాష సంస్కృతికి చారిత్రక నేపథ్యం ఉందని పూర్వం ఏదైనా ఒక రచన చేస్తే దాన్ని ప్రచురణ కర్తలు ముద్రిస్తే అందరూ చదువుకునే వారని కానీ నేడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని అర చేతిలో మొబైల్ ద్వారా ప్రపంచాన్ని చూస్తున్నారని , నేను ప్రభుత్వ అధికారి హోదాలో ఉన్నానంటే చదువుకునే రోజుల్లో గ్రంథాలయానికి వెళ్ళేవాడినని గుర్తు చేశారు. కర్ణాటకకు చెందిన వాణ్ణి అయినప్పటికీ తెలుగు భాష, సాహిత్యం కళల్లో కూడా పట్టు ఉందన్నారు. పిల్లల్ని చదువు పట్ల గ్రంథాలయం పట్ల ఆసక్తి పెంచడంలో తల్లిదండ్రులు ప్రోత్సాహం అవసరం అన్నారు. ఈ సందర్భంగా బాలలు చేస్తున్న కార్యక్రమాన్ని వీక్షించి వారిలో ఉన్న నైపుణ్యాన్ని చూసి ముగ్దులై నిర్వాహకుల్ని అభినందించారు. ప్రజా గాయకులు చంద్రా నాయక్ దేశభక్తి గేయాలు ఆలపించారు. ప్రచురణ కర్తలు పుస్తకాలతో కలెక్టర్‌ను సత్కరించారు. గోళ్ళ నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో పుస్తక మహోత్సవ సంస్థ అధ్యక్షులు లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు , జే వి వి ప్రతినిధి కే శ్రీనివాస్, పల్లవి వెంకట నారాయణ , రెహమాన్, అరసం అరుణ కుమార్, జేపీ ప్రసాద్, నిహారిక, విశ్వరావు, హసీనా, శోభన్, బోయ రవి పాల్గొన్నారు.

కళాత్మక యోగాంధ్ర : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ:కళాకారులు సాంస్కృతిక వాస్తు శిల్పులు.. కళాకారులకు సమాజంలో మార్పు తెచ్చే శక్తి ఉందని, వారి కళా ప్రదర్శనలు సమాజాన్ని మెరుగైన మార్గంలో అడుగులు వేయిస్తాయని, సంపూర్ణ ఆరోగ్యానికి సోపానమైన యోగాను ప్రతిఒక్కరికీ చేరువచేసేం దుకు కళాకారులు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన ఆర్టిస్ట్ థీమ్ యోగా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని నాట్యాచార్యులు, కళాకారులతో కలిసి యోగాసనాలు అభ్యసిం చారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేయాలనే ఉద్దేశంతో థీమ్ యోగా నిర్వహిస్తున్నామని, థీమ్ యోగాలో భాగంగా ఈ నెల 31న అన్నదాతలతో యోగాసనాల అభ్యసన కార్యక్రమం ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహి స్తున్న యోగాంధ్రలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఘంటసాల వెంకటేశ్వ రరావు సంగీత కళాశాల ప్రిన్సిపల్ నరసమ్మ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయ ణరావు, ప్రముఖ నాట్యాచార్యులు కళారత్న భాగవతుల వెంకట రామశర్మ, కళాక్షేత్ర నృత్య అకాడమీ హవీష చౌదరి, భక్తనారద గానసభ అధ్యక్షులు కళారత్న డా. ఆకురాతి కోదండరా మయ్య, వివిధ కళా సంస్థల ప్రతినిధులు మల్లాది స్వాతి, రఘువేదం కిషోర్, అంబేద్కర్ సాంస్కృతిక సేవా సంఘం ప్రతినిధి జోషి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు (మొదటిపేజీ తరువాయి)

అందిస్తున్నారని అన్నారు. అటువంటి ప్రాధాన్యత గల గుంటూరు ఛానల్ నిర్లక్ష్యపు నీడలో కూరుకుపోయిందని విమర్శించారు. నేటికీ కాలువకు మరమ్మతులు చేయలేదన్నారు. గత ఏడాది ఆగస్టులో వచ్చిన తుపాను కారణంగా 40 చోట్ల గండ్లు పడ్డాయన్నారు. దీని అభివృద్ధికి గతంలో రూ.1.20 కోట్లు మంజూరు చేశారని, అయితే రూ.60 లక్షలు పనులు జరగలేదని అన్నారు. జూన్ నెల వచ్చేసిందని రాబోయే ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడితే ఇటుగా ప్రయాణించే పరిస్థితి కూడా ఉండ దని పేర్కొన్నారు. గుంటూరు, మానస సరోవరం, మంగళగిరి డ్రైనేజీ నీరు ఈ కాలువలో కలుస్తుందని పేర్కొన్నారు. తెల్లవాగు శిథిలావస్థకు చేరిందని అన్నారు. గుంటూరు ఛానల్ కాల్వపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరిందని కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ కాలువను పరిశీలించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ హామీ మేరకు లోకేష్ యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో వర్షాకాలం, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతోందని గుర్తుచేశారు. గుంటూరు ఛానల్ కాలువ పరిధిలో 25 గ్రామాలు ఉన్నాయని ఛానల్ క్రింద వేలాది ఎకరాలు సాగులో ఉందని తెలిపారు. గతంలో భారీ వర్షాల వలన కట్టలు తెగిపోయి బలహీనపడ్డాయని విమర్శించారు. అండర్ డ్రైనేజ్ వద్ద కట్టలపై ఉన్న గోడలు పడిపోయాయని రైతులు నడవాలంటే భయపడే పరిస్థితి నెలకొందని విమర్శించారు. గోడలు పడిపోయి చాలాచోట్ల కాలువ కట్ట కోసుకుపో యింది న్నారు. పెద్ద మొత్తంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటు కాడను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీటి సంఘాల అధ్యక్షులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని నిర్లక్ష్యాన్ని వీడాలని అధికారులు స్పందించి గుంటూరు ఛానల్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గుంటూరు ఛానల్‌లో తూటాకు, గుర్రపు డెక్క పెరిగిపోతూ వస్తోందని అయినప్పటికీ ఇంతవరకు సరైన పరిష్కార చర్యలు చేపట్టలేదని విమర్శించారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా కట్టలు తెగిపోయాయని అన్నారు. తక్షణమే త్వరితగతిన గుంటూరు ఛానల్ మరమ్మత్తు పనులను చేపట్టాలని, చినకాకానిలో కాల్వపై వంతెనను పునర్నిర్మించాలని లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. జనసేన పార్టీ నాయకులు సుంకర సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నారై వైద్యశాల నుంచి వచ్చే మురుగు మొత్తం గుంటూరు ఛానల్‌లో కలుస్తుందని అన్నారు. అధికారులు ఈ ఛానల్‌ను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి తక్షణమే గుంటూరు ఛానల్‌కు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శి పచ్చల శివాజీ, రైతు సంఘం నాయకులు జుజ్జూరు శంకర్రావు, పొన్నెకంటి రాధాకృష్ణ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మికి ప్రమాద బీమా చెల్లించాలి

విశాలాంధ్ర -అవనిగడ్డ: పని ప్రదేశంలో చనిపోయిన గాజుల లక్ష్మికి ప్రమాద బీమా చెల్లించాలి అని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. మండలం మోదుమూడి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మి గురువారం ఉదయం ఉపాధి హామీ పథకం పనికి వెళ్లి అస్వస్థతకు గురై చిన్న వయస్సులో చనిపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటికైనా పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెడికల్ కిట్లు, షామియానా. మంచినీరు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన గాజుల లక్ష్మి కుటుంబానికి ప్రమాద బీమా కింద ప్రభుత్వం సాయం ప్రకటించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినారు. గాజుల లక్ష్మి మృతికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా తరపున సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

డ్రైన్లపూడిక పనులు చేపట్టాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గన్నవరం : గన్నవరం పట్టణంలో డ్రైనేజి పూడిక తీత ఆలస్యం కావటంతో గ్రామాల్లోని డ్రైనేజీల పూడిక తీసి శుభ్రం చేయాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ నిధులతో గన్నవరంలో డ్రైనేజీ పనులను ఈ నెల రెండో వారంలో పాటిదిబ్బల వద్ద ఎమ్మెల్యే వెంకట్రావ్ ప్రారంభించారు. వివిధ కారణాలతో ఈ పనుల్లో జాప్యం జరుగ్గా ఈ సమస్య ఎమ్మెల్యే దృష్టికి వెళ్ళింది. వెంటనే స్పందించిన యార్లగడ్డ డ్రైనేజీ పనుల్లో జాప్యం జరగటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించిన ఆయన తక్షణమే పనులు చేపట్టాలని పంచాయతీ ఈఓని ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి జాతీయ రహదారిపై డ్రైనేజీల్లో మట్టి తీసి శుభ్రంచేసే పనిని గ్రామ పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికను చేపట్టారు. గన్నవరంలోని ప్రధాన డ్రైన్లతోపాటు అంతర్గత రహదారుల్లోని డ్రైనేజీలలో పూడికతీసి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను హెచ్చరించారు.

మతసామరస్యానికి తోడ్పడాలి : ఎస్ఐ

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: మత సామరస్యానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని విస్సన్నపేట ఎస్ఐ జి.రామకృష్ణ సూచించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక జామియా మసీదు కమిటీ సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం సోదరులు బక్రీద్‌ను సంతోషంగా జరుపుకోవాలని, గోవధపై కేంద్రప్రభుత్వం నిషేదం విధించినందున ప్రభుత్వ నిబంధనల అమలుకు సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు. పలువురు ముస్లిం ప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మొబైల్ టెక్నాలజీ బస్ సందర్శన

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇన్ఫోసిస్ లిమిటెడ్ హైదరాబాద్ సంయుక్తంగా రూపొందించిన మొబైల్ టెక్నాలజీ ట్రైనింగ్ బస్‌ను,జె ఆర్ సి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ వారి సమన్వయంతో ఏర్పాటు చేయబడిన బస్సుని శుక్రవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) సందర్శించారు.ఈ మొబైల్ బస్‌లో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ ఐ), రోబోటిక్స్, వెబ్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో శిక్షణల్ని అందిస్తున్నారు. ఈ శిక్షణలు ఇన్ఫోసిస్ కంపెనీకి చెందిన ప్రత్యేక నిపుణులచే పూర్తిగా ప్రాక్టికల్ పద్ధతిలో చేపడుతున్నారు. దీని ద్వారా విద్యార్థులు ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీలో ప్రావీణ్యం సంపాదించగలుగుతున్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ ఆధునిక శిక్షణ పథకాలు యువతకు కొత్త ఆశలు నింపుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమం లో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,జె ఆర్ సి విద్యా సంస్థల చైర్మన్ రంగాపురం నరసింహ రావు, సెక్రటరీ కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్ మరియు ప్రిన్సిపాల్ జూటూరి వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటు : వీరభద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్ మరణం నగర పార్టీకి తీరని లోటని పార్టీ నగర సహాయ కార్యదర్శి నక్కి వీరభద్రరావు అన్నారు. శుక్రవారం 32వ డివిజన్ సెక్రటరీ డిబికె రావు అధ్యక్షతన శ్రీనివాస్ 3వ వర్ధంతి కార్యక్రమం డివిజన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీరభద్రరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరం, డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతానికి శ్రీనివాస్ పెద్దఎత్తున కృషి చేశారని అన్నారు. దురదృష్టవశాత్తు జరిగిన ఆయన మరణం పార్టీకి , నగర కమిటీకి తీరనిలోటన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు మూలి సాంబశివరావు, పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు బుట్టి రాయప్ప, నగర కార్యవర్గ సభ్యురాలు డి సీతారామమ్మ , డివిజన్ మహిళా సెక్రటరీ బి రాజ్యలక్ష్మి , అధ్యక్షులు జి రాహేలమ్మ , లోటస్ ఆటో స్టాండ్ కమిటీ నాయకులు ఎలీషా ,కొండ, సదాశివరావు, క్రాంతి, డివిజన్ సహాయ కార్యదర్శి పత్తిపాటి రాజు , జి విమల్ కుమార్, ఏఐవైఎఫ్ నగర ఉపాధ్యక్షులు సిహెచ్ శ్రీధర్, పి శ్రీను, అరవింద్ స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - గుడివాడ : ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపు మేరకు రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం జె.యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ కె.వి.కె నిర్వహించే కార్యక్రమాలు, లభ్యమయ్యే విత్తనాలు, భూసార పరీక్ష ఉపయోగాల గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం డా.కె.నాగేంద్రరావు మాట్లాడుతూ వరిలో నూతన వంగడాలు, వివిధ నేలలకు అనువైన వరి రకాల గురించి వాటిలో చేపట్టవలిసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డా. సుబ్బన్న మాట్లాడుతూ ఆయిల్ పామ్‌సాగు గురించి చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఎస్.రమాదేవి, వ్యవసాయశాఖ ఏ.డి.ఎ. మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను, సేంద్రియ వ్యవసాయం ఉపయోగాలను వివరించారు. జె.కీర్తి మాట్లాడుతూ వివిధ ఉద్యాన సబ్సిడీ వివరాలు గురించి తెలియజేశారు. మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖల ద్వారా వచ్చే వివిధ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లాయపాలెం, బేతవోలు, వలివర్తిపాడు, లింగవరం, జనార్ధనపురం, పుట్టగుంట రైతులు పాల్గొన్నారు.

జాబ్ మేళా

విశాలాంధ్ర-తిరువూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ - సీడాప్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు సంయుక్త అధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు 'జాబ్ మేళా' నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి బ్రహ్మం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంయుక్తంగా నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పన అధికారి బ్రహ్మం మాట్లాడుతూ అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలరావు,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మాట్లాడుతూ ఉద్యోగం చిన్నదా, పెద్దదా అన్న అపోహను యువత పెట్టుకోవద్దని, ఉద్యోగం చేసుకుంటూ వెళ్తే అదే ఆ వ్యక్తులను ఉన్నత స్థితికి తీసుకెళ్తుందన్నారు.ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా మొత్తంగా 152 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో 63 మంది ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎస్. శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి,జిల్లా నైపుణ్యాభివృద్ధి సిబ్బంది నరేష్ కిషోర్,లావణ్య , మధు , సీతామహాలక్ష్మి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలి : మండలి

విశాలాంధ్ర -అవనిగడ్డ : ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపు నిచ్చారు. శుక్రవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం, ఏఎంసీ ప్రమాణ స్వీకార కార్యక్రమ సన్నాహాలపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జూన్ 2 సోమవారం ఉదయం పది గంటలకు కొడాలి మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఘంటసాల ఏఎంసీ తోట కనకదుర్గ, పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహా పలువురు రాష్ట్ర మంత్రులు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని మండలాల నుంచి కూటమి పార్టీల నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చేలా శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ ఘంటసాల మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, జనసేన పార్టీ మండలాల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, పూషడపు రత్నగోపాల్, మర్రె గంగయ్య, కోన రాజశేఖర్, టౌన్ అధ్యక్షులు రాజనాల వీరబాబు, కోట రాంబాబు, బొందలపాటి వీరబాబు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు (చినబాబు), ఏఎంసీ చైర్ పర్సన్ తోట కనకదుర్గ, వైస్ చైర్మన్ అత్తలూరి గోపీచంద్, సర్పంచులు ఎంపీటీసీలు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాయర్ల విధులు బహిష్కరణ

విశాలాంధ్ర-ఉయ్యూరు : నేరస్తులు, రౌడీషీటర్ల పేరుతో తెనాలిలో పోలీసులు బహిరంగ దండనను నిరసిస్తూ, ఆ దండనకు గురైన వారిలో లాయర్ ఉన్నాడంటూ, పోలీసులు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఇటీవల తెనాలిలో పోలీసులపై దాడి చేశారని ఆరోపణతో రౌడీ షీటర్ లంటూ ముగ్గురు వ్యక్తులను నడిరోడ్డులో వారి పాదాలపై లాఠీలతో కొడుతూ వాటిని వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడం జరిగింది. ఆ ముగ్గురిలో ఒకరు లాయర్‌గా పేర్కొంటూ అతనిపై భౌతిక దాడి చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించటమే అని ఆరోపిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అయితే ఆ వ్యక్తి న్యాయవాద వృత్తి చేపట్టకముందు నేరాలకు పాల్పడ్డాడా? లేక వృత్తి చేపట్టిన తర్వాత నేరాలకు పాల్పడ్డాడా? అని, ఈ విషయంలో చర్యలు చేపట్టవలసిన బార్ కౌన్సిల్ ఏమి చేస్తోందంటూ సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

గుప్తా, వేంకటరమణలకు సూపర్ స్టార్ ఐకాన్ అవార్డ్స్

విశాలాంధ్ర -విజయవాడ కల్చరల్ :మహానటి ఎస్ ఎస్ఎస్ కెఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలుగు చలనచిత్ర రంగంలో సాహసాలకు ఐకాన్‌గా నిలిచిన సూపర్ స్టార్ కృష్ణ 82వ జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై సంస్థ అధినేత్రి డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి నటుడు, రచయిత, న్యాయవాది, సామాజిక సాంఘిక సేవాతత్పరుడు, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వేముల హజరత్తయ్యగుప్త, నటుడు, రచయిత, దర్శకుడు పసుపులేటి వేంకటరమణలకు సూపర్ స్టార్ ఐకాన్ అవార్డ్స్‌ను ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా బివి వీరభద్రరావు, డేవిడ్ రాజు, ప్రసూన రామన్ తదితరులు సినీ సాహసాలకు చిరునామా సూపర్ స్టార్ కృష్ణ అని, తెలుగు చలనచిత్రాలకు 70ఎంఎం, ఈస్ట్ మన్ కలర్, ఫుల్ స్కోప్ వంటి కొత్త రంగులు అద్ది సాంకేతిక హంగులతో సాహసోపేతమైన నిర్ణయాలకు శ్రీకారం చుట్టి నిర్మించి గుర్తింపు తెచ్చుకున్న పద్మభూషణ్ కృష్ణ పేరిట పురస్కారాలను సముచితమైన వ్యక్తులకు ప్రదానం చేయటం గర్వకారణం అన్నారు. వ్యాఖ్యాతగా డాక్టర్ కొప్పుల అశోక్ ఆనంద్ వ్యవహరించారు. అదే వేదికపై వడ్డాది కామేశ్వరి, విష్ణు ప్రియ, మల్లీశ్వరి, రసూల్ బాబు లు కృష్ణ నటించిన చిత్రాలలోని పాటలను హృద్యంగా పాడి వినిపించి ఆహూతుల అభినందనలందుకున్నారు.

అనువైన వరి వంగడాలు ఎంచుకోవాలి

విశాలాంధ్ర, కూచిపూడి : ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త నిర్వహణలో శుక్రవారం మండల కేంద్రమైన, మొవ్వ శ్రీ మండవజానకిరామయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణమండపంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.యం. వెంకట లక్ష్మి (సస్యపోషణ) మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో సార్వాపంటకు అనువైన వరి రకాలు, ఆరోగ్యవంతమైన నారు పెంచడానికి తగు సూచనలు, ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సస్య రక్షణ యాజమాన్యం, భూసార పరీక్షా గురించి వెల్లడించారు. పెదవేగి భారతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పెదవేగి శాస్త్రవేత్తడాక్టర్. బి. కళ్యాణ్ బాబుఆయిల్ పామ్ సాగు గురించి, చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొవ్వ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు సూరపనేనిశ్యామల , మండల వ్యవసాయ అధికారి కంచర్లశివప్రసాద్, డి. ఎం. పి.రాంబాబు, సచివాలయాల వీఏఏలు, ఏఈఓలు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్లలో ఉన్న విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. డూప్లికేట్ విత్తనాలు, ఇతరత్రా అనధికారికంగా విత్తనాలు నిల్వ చేశారా, స్టాకు రిజిస్టర్లు విత్తనాలు స్టాకు సక్రమంగా ఉన్నాయా అని పరిశీలించారు. స్టాకు రిజిస్టర్‌లో నిల్వ ఉన్న స్టాకు అన్ని సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు స్టాకు బోర్డు ఉండాలి, పత్తి, మొక్కజొన్న, పెసలు, కందులు, మినుములు ఇతర విత్తనాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విత్తనాలను అమ్మాలని అత్యధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి హెచ్చరించారు. రైతులు విత్తనాల దుకాణాల్లో కొనేటప్పుడు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని, ఎమ్మార్పీ రేట్లు కన్నా ఎక్కువ అమ్మితే విత్తనాల దుకాణాలపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

మ్యాజిక్ 'షైన్స్'ని విడుదల చేసిన ఐటీసీ సన్ ఫీస్ట్ మామ్స్

విజయవాడ: ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసింది. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోంది. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే, వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది కుకీ యొక్క మెరుపును సజీవంగా తెస్తుంది. దీని కోసం, మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీ ని విడుదల చేసింది, ఇది దాని తాజా ఆవిష్కరణ గురించి వెల్లడిస్తుంది. రుచి మరియు ఆకృతిని పెంచే ప్రత్యేకమైన మెరిసే చక్కెర గ్లేజింగ్‌తో రూపొందించబడిన , ఈ కుకీలోనోరూరించే వెన్న నింపబడింది, కుకీ కొరికిన ప్రతిసారీ మహోన్నతమైన మరియు సంతృప్తికరమైన రుచిని అందిస్తుంది. దీనిలోని కరకరలాడే ఎనిమిది పొరలు ఒక ప్రత్యేకమైన, నోటిలో కరిగిపోయే అనుభవాన్ని సృష్టిస్తాయి, అసమానమైన ట్రీట్‌గా మారుస్తాయి. రోజువారీ స్నాక్స్ అనుభవాన్ని షైన్స్ మెరుగుపరుస్తుంది, ఇది పగటిపూట తినడానికి , టీ-టైమ్ క్షణాలను ఆస్వాదించటానికి సరైన అనుబంధంగా మారుస్తుంది. మామ్స్ మ్యాజిక్ ఒక టీవీసీని విడుదల చేసింది, ఇది తన బిడ్డ ఎదుగుదలలో ఒక తల్లి యొక్క తిరుగులేని మద్దతు యొక్క సారాంశాన్ని అందంగా ఒడిసిపడుతుంది. ఈ చిత్రంలో, నదియా మొయిదు ఒక తల్లి పాత్రను పోషించారు. ఆమె క్రంచీ బటర్ కుకీపై సున్నితమైన చక్కెర గ్లేజింగ్‌ను వర్తింపజేయడం వల్ల దానిలోని మెరుపు ఎలా బయటపడు తుందో అందంగా తెలియజేస్తారు. అదే విధంగా, చెన్నైలో చెస్ శిక్షణ పొందాలనే తన కుమార్తె కలను నెరవేర్చడానికి మద్దతు ఇవ్వడం, దానికోసం తమ మామగారిని సున్నితంగా ఒప్పించడం, తద్వారా ఆమె తన బిడ్డ సామర్థ్యాన్ని వెలికి తీసుకురావటానికి కృషి చేయటం దీనిలో కనిపిస్తుంది. తమ పిల్లలలోని ఉత్తమతను బయటకు తీసుకురావడానికి అదనపు కృషి చేసే తల్లులకు ఈ టీవీసీ ఒక నివాళి అని ఈ ఆవిష్కరణ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ తెలిపారు.

యోగాతో ఆరోగ్యం : ఝాన్సీలక్ష్మి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సూచనలతో యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా నగర కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పివి. ఫణికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈడేపల్లి గానుగకొట్లు సెంటర్ నుంచి సిడింబి అగ్రహారం మున్సిపల్ పార్కు వరకు యోగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి కే. ఝాన్సీలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ యోగా అనేది శారీరక ఆసనాలు, శ్వాస నియంత్రణ, ధ్యానం, నైతిక ఆచారాల సమ్మేళనమని, ఆసనాలు శరీరాన్ని బలంగా, ఫ్లెక్సిబుల్‌గా చేసే శారీరక వ్యాయామాలు అన్నారు. యోగ ప్రతి నిత్యం చేయడం వలన మన శారీరక ఆరోగ్యం ఎంతో మెరుగుపడడమే కాకుండా మానసిక ప్రసాంతత కలుగుతుందన్నారు. ఒత్తిడిని తగ్గిస్తుందని, శ్వాస సమస్యలు, నిద్రలేమి అధిక రక్తపోటు వంటి సమస్యలకు ఉపశమనంగా యోగా ఉపయోగపడుతుందన్నారు. రేవతి భాను మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 8 ఏళ్లుగా యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, యోగ విశిష్టతను ప్రజలకు తెలిపే విధంగా 45వ డివిజన్ లో ర్యాలీ నిర్వహిస్తున్న ఫణికుమార్ కు అభినందనలు తెలుపుతున్నామన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేసేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. యోగా ద్వారా ప్రజలకు ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంజాల రవికుమార్, కొనకళ్ళ భాను ప్రసాద్, డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు మురాల నాగేంద్ర రావు, మడిపల్లి శ్రీనివాస్, కృష్ణవేణి ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ కొత్తగుండు రమేష్, యోగా మాస్టర్ మద్దాల చింతయ్య, ముదిగొండ శాస్త్రి, 45వ డివిజన్ సచివాలయ అడ్మిన్ షేక్ అల్లాబక్షు, డివిజన్ సచివాలయ సిబ్బంది ఎం. మానస, గంగా భవాని, ఏ. రామాంజనేయులు, రామశేఖర్, పుట్టి రత్నం, చలమలశెట్టి పోతురాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర- విజ యవాడ (గాంధీనగర్) : రైల్వే లో బ్రిడ్జి వద్ద ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే సీఐ జేవీ రమణ తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం ఉదయం కాళేశ్వరావు మార్కెట్ సమీపంలో ఉన్న రైల్వే లో బ్రిడ్జి వద్ద ఉన్న పైపులైన్‌కి గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తమకు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ సమాచారం అందించారన్నారు. వెంటనే తమ ఎస్సై టీ.భాస్కరరావు,సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 35 నుండి 40 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి వాటర్ వెళ్ళు పైప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఎత్తు 5.5, చామనఛాయ రంగుతో ఉన్నాడు. శరీరంపై ఎరుపు రంగు టీ షర్ట్‌పై నలుపు,తెలుపు అడ్డ గీతలు ఉన్నాయి,బూడిద కలర్ ప్యాంటు కలిగే ఉన్నాడు కుడిచేతికి స్టీల్ కడియం కలిగి ఉన్నాడు. అను మానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చామన్నారు.మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసినట్ల యితే విజయవాడ రైల్వే పోలీసులను 9440627544, 9440581862 సంప్రదించాలని సిఐ తెలిపారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ: జూన్ 1ఆదివారం కావడంతో ఈ నెల 31న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేపట్టడం జరుగుతుందని పేదల సేవలో స్ఫూర్తికి అనుగుణంగా పెన్షన్లను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మే 31న చేపట్టే ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల కింద 2,,27,786 పెన్షన్లకు దాదాపు రూ. 98.11 కోట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల సేవలో స్ఫూర్తికి అనుగుణంగా పెన్షన్ల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు కలెక్టర్ సూచనలు చేశారు.

నేడు ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడుగా విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎ.విద్యాసాగర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 31వ తేదీన జరగనున్నదని ఎన్జీవో నగర అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విజయవాడ గాంధీనగర్ ఏపీ ఎన్‌జీవో హెూమ్ నుంచి భారీ సంఖ్యలో బైక్, కార్ ర్యాలీతో ఊరేగింపుగా బయలుదేరి నగరంలోని శేషసాయి కళ్యాణమండపానికి చేరుకుంటారని తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షునిగా సాయంత్రం 5.00 గంటలకు ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్‌లో వివిధ హెూదాల్లో సేవలందించి ఉద్యోగుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి పరిష్కరించడంలో తనదైన ముద్ర వేసుకొని ఉద్యోగుల మన్ననలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు సి. వి. ఆర్. ప్రసాద్ పిలుపునిచ్చారు.

శ్రామిక వర్గాల హక్కుల కోసం నిరంతర కృషి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : శ్రామిక వర్గాల హక్కులు కోసం నిరంతరం సాధించేందుకు అందరికతో కలసి పోరాడుతూ అందరివాడు గుర్తింపు పొందిన ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు లోయ వెంకట కుటుంబరావు అని పలువురు వక్తలు ఆయన 3వ వర్ధంతి సభలో కొనియాడారు. శుక్రవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఆయన వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా కుటుంబరావు చిత్రపటం వద్ద పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. రామకృష్ణ మాట్లాడుతూ 1988లో విజయవాడ ఐటి కాలేజీలో చేరిన ఎల్వీ కుటుంబరావు పిడిఎస్‌యు విద్యార్థి సంఘం పట్ల ఆకర్షితు డైనాడని వివరించారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన కుటుంబరావు పిడిఎస్‌యు రాజకీయాల్లో చేరిన పిదప రాజీలేని పోరాటాలు చేశాడు అన్నారు. టెక్నికల్ విద్యార్థి విభాగానికి, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకుడిగా పనిచేశాడని కీర్తించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో విస్తృతంగా పనిచేసి పిడిఎస్‌యుని అగ్ర భాగాన నిలబెట్టిన నాయకుల్లో కుటుంబరావు ఒకడన్నారు. చదువు ముగిసిన తర్వాత ఆటో నడుపుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటూ ఇఫ్టూ కార్మిక రంగంలో రాష్ట్ర నాయకుడిగా ఎదిగాడని కొనియాడారు. ప్రధానంగా ఆటో రంగ సంస్థలపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాడని ఉద్యమాలు నిర్వహించాడని వివరించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు యు. వీరబాబు మాట్లాడుతూ కుటుంబరావు ఏ లక్ష్యం ఏ ఆశయం ఏ సిద్ధాంతాల కోసం పోరాడారో, అవి కొనసాగించడం ద్వారానే ఆయనకి నిజమైన నివాళులులన్నారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్‌బాబు ,మాజీ పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు రవీంద్రనాథ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ, కార్యదర్శి జి. హరికృష్ణా రెడ్డి సెంట్రిక్ యూనియన్ అధ్యక్షుడు పెద్దిరాజు, పివోడబ్ల్యూ నగర అధ్యక్షురాలు ఆసియా, కుటుంబరావు భార్య ,కుటుంబరావు కుమారుడు సాహిత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవో సభకు సంఘీభావ ప్రదర్శన

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విజయవాడలో నిర్వహించనున్న ఏపీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ ప్రమాణస్వీకార సభను జయప్రదం చేయాలని శుక్రవారం ఏపీఎన్జీవో సంఘం పలు కార్యాలయాల్లో సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా సాగర్ మరోమారు ఎన్నికయ్యారని, కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం, ఉద్యోగ సమస్యల సాధనకు చేపట్టనున్న ప్రణాళిక ప్రకటన ఈ సభలో ఉంటుందని విస్సన్నపేట యూనిట్ అధ్యక్షుడు పి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, పలువురు ఉద్యోగులు హాజరయ్యారు.

జూన్ 1 నుంచి డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

విశాలాంధ్ర-తిరువూరు: జూన్ 1 నుంచి నేరుగా రేషన్ డీలర్ల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ జరుగనున్నందున శుక్రవారం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి వచ్చే నెల నుంచి నిత్యాసర సరుకుల పంపిణీలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా తిరువూరు మండలం, తిరువూరుఎంఎల్‌ఎస్ పాయింట్ నందు తిరువూరు డివిజన్‌లోని అన్ని ఈ పాస్ మిషన్లు, వేయింగ్ మిషన్లలను నైపుణ్యం గల సాంకేతిక నిపుణులతో వాటిని బాగు చేయించి తగు చర్యలు తీసుకోను న్నారు. డీలర్స్‌కు వేయింగ్ మిషన్లు రేషన్ కార్డ్ అప్లై మిషన్ లో పరిశీలించారు

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే

విశాలాంధ్ర -పమిడిముక్కల: ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని ఐనంపూడి సర్పంచ్ యోనుగ బేబి అన్నారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు కె.వి.ప్రసాద్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా సదరు కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో పదవతరగతిలో మంచి మార్కులు సాధించిన వారికి నగదు బహుమతి అందజేస్తున్నామని ఈ సంవత్సరం తిరుమల శెట్టి నిఖిత సాయి అత్యధి మార్కులు సాధించినట్లు తెలిపారు.కమిటీ అధ్యక్షుడు శీలం రమేష్ మాట్లాడుతూ పిల్లలు భవిష్యత్తు పురోభివృద్ధికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రూ.30 వేలు పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు బహుమతి ఇస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలును ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొల్లా వెంకటేశ్వర రావు పరాశరం శ్రీరామ్ కమిటీ సభ్యులు శీలం మురళీ కొల్లి నరసింహ రావు కె.చందు టి.నాగరాజు టి.నాగ సురేష్ గ్రామస్థులు పాల్గొన్నారు.

జూన్ 1 నుంచి డీలర్ల వద్దే రేషన్ పంపిణీ

విశాలాంధ్ర -పమిడిముక్కల: జూన్ ఒకట నుంచి రేషన్ దుకాణాల వద్దనే లబ్ధిదారులు నిత్యావసర సరుకుల తీసుకోవాలని తహశీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ ఇచ్చే వ్యానులు రద్దాయని రేషన్ ఉదయం గం,,8 నుంచి మా,, 12 గం,,వరకు మరల సాయంత్రం 4 గం,, నుంచి రాత్రి 8గం,, వరకు తీసుకోవచ్చని కార్డుదారులు విషయాన్ని గమనించాలని తహశీల్దార్ నవీన్ కుమార్ తెలిపారు.

డాబర్ గ్లూకోజ్ 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారం

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : హౌస్ ఆఫ్ డాబర్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ ఎనర్జీ డ్రింక్ అయిన డాబర్ గ్లూకోజ్, యువ క్రీడా ప్రతిభను ప్రోత్సహించడానికి అవగాహన పెంచడానికి 'ఎనర్జైజ్ ఇండియా' అనే మెగా ప్రచారాన్ని ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా, డాబర్ గ్లూకోజ్ విజయవాడలోని ఐజీఎంసి బాక్సింగ్ అకాడమీలో శక్తి, స్టామినా నిర్వహణపై ప్రత్యేక అవగాహన సెషన్‌ను నిర్వహించిందన్నారు. విజయవాడలోని అకాడమీలో, ఈ రంగంలో ప్రఖ్యాత వైద్యుడు, కోచ్‌లు, డాబర్ ఇండియా నుండి పి. ఇసాక్, దినేష్ కుమార్ ఉన్నారు. ఈ సెషన్ అథ్లెట్లు వారి పనితీరును ఆప్టిమైజ్ చేయడానికి, వారి పూర్తి సామర్థ్యాన్ని సాధించడంలో సహాయపడటానికి విలువైన వ్యూహాలను అందించిందన్నారు. ఈ అకాడమీకి చెందిన అగ్రశ్రేణి అథ్లెట్లు సుతాన్వి, సుశ్రుత అండ్ సూర్య ప్రణవ్‌లను డాబర్ సత్కరించిందన్నారు. యువ అథ్లెట్లలో శక్తి మరియు సత్తువ యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి, వారి సంబంధిత క్రీడలలో రాణించడానికి అవసరమైన శక్తిని అందించడానికి మా 'ఎనర్జైజ్ ఇండియా' ప్రచారాన్ని ప్రారంభించడం మాకు సంతోషంగా ఉందన్నారు. తక్షణ శక్తి బూస్ట్‌తో, యువ అథ్లెట్లు శక్తివంతంగా ఉండటానికి, ఉత్తమ ప్రదర్శన ఇవ్వడానికి డాబర్ గ్లూకోజ్ సరైన ఎంపిక" అని గార్గ్ జోడించారు.

సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు ప్రశంసలు

విశాలాంధ్ర- సత్తెనపల్లి : పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని నారాయణ సేన నగర సంకీర్తన బృందం ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి నాగమల్లేశ్వరరావును నారాయణ సేన నగర సంకీర్తన బృందం, హనుమాన్ భక్తులు వీరి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఇటీవల హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన హనుమాన్ శోభాయాత్రకు అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా స్వయంగా విధులు నిర్వహించిన సిఐ నరహరి నాగమల్లేశ్వరరావును శాలువాతో సత్కరించి ఒక జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఈ శోభ యాత్ర కన్వీనర్ తోమండ్రు ఆనంద్, ఆర్య వైశ్య చలివేంద్ర సంఘము అధ్యక్షులు బచ్చు కొండలు, సత్తెనపల్లి పెదకూరపాడు ఆర్.ఎస్.ఎస్ ఖండ సంఘచాలక్ చలువాది చిన సత్యనారాయణ, సత్తెనపల్లి గోశాల అధ్యక్షులు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, కార్యదర్శి నోముల వెంకట రమణ, న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, రాజవరపు నరసింహారావు పాల్గొన్నారు.

చెరువులు నింపి, తాగునీటి సమస్య లేకుండా చూడండి

విశాలాంధ్ర - చిలకలూరిపేట : పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రెండు మంచినీటి చెరువుల్ని సాగర్ నీటితో పూర్తిగా నింపి, ప్రజలకు నీటిఇబ్బందులు లేకుండా చూడాలని మాజీమంత్రి, ఎమ్మెల్యేప్రత్తిపాటి పుల్లారావు అధికారులకు సూచించారు. పట్టణశివారులోని తాగునీటి చెరువుల్లోకి చేస్తున్న నీటి పంపింగ్‌ను శుక్రవారం ప్రత్తిపాటి అధికారులతో కలిసి పరిశీలించారు. ఒకట్రెండు రోజుల్లో సాగర్ నుంచి వచ్చే నీటితో చెరువులు సంపూర్ణంగా నిండాలని, నీటి పంపింగ్ లో ఎదురయ్యే సమస్యల్ని త్వరగా అధిగమించాలని ప్రత్తిపాటి అధికారులకు సూచించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది చెరువులు నిండుకుండల్లా జలకళను సంతరించుకున్నాయని, నీరు సమృద్ధిగా ఉండటంతో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు ఉండవని ప్రత్తిపాటి చెప్పారు. గత ప్రభుత్వం పట్టణ ప్రజలకు సక్రమంగా తాగునీరు కూడా అందించలేదన్న ప్రత్తిపాటి, కూటమి ప్రభుత్వంలో నిత్యం నీటిసరఫరా జరిగేలా అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. తొలకరి వానలు మొదలవడంతో రైతులు సాగుపనుల్లో నిమగ్నమయ్యారని, వ్యవసాయ అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రత్తిపాటి సూచించారు. చెరువుల పరిశీలనకు వెళ్లిన ప్రత్తిపాటి వెంట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, మద్దుమల రవి, వినాయకరావు, జంగా సుజాత, అప్పారావు ఉన్నారు.

ముగిసిన ఎంఎస్ ఆఫీస్ హ్యాండ్స్- ఆన్‌శిక్షణా

విశాలాంధ్ర - నరసరావుపేట : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) నరసరావుపేట క్యాంపస్‌లో మే 19 నుండి మే 30 వరకు నిర్వహించిన ఎంఎస్ హ్యాండ్స్-ఆన్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. కార్యక్రమాన్ని డాక్టర్ జీ.పి. రాజు సమన్వయంతో నిర్వహించగా, శిక్షణను ఎన్‌వీ రామారావు అందించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రశంసా ధ్రువపత్రాలు ముఖ్య అతిథి ప్రొఫెసర్ శ్రీనివాస్ రావు చేతుల మీదుగా అందజేశారు.

అభివృద్ధి పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి శంకుస్థాపన

విశాలాంధ్ర - నూజెండ్ల : మండలం కమ్మవారిపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో రూ. 15 లక్షల వ్యయంతోటి చేపట్టనున్న అభివృద్ధి పనులకు, మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాల అదనపు తరగతి గదుల కోసం ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి, ముఖ్యంగా నిరుపేదలు నివసించే కాలనీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష నెరవేరిందని ఆయన అన్నారు. ఈ నిధులతో కాలనీలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని, ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతా యని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాపులూరి ఉమాదేవి, తహసిల్దార్ రమేష్ కుమార్, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జూలకంటి బ్రహ్మారెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తు

కూటమి నాయకుల రాస్తారోకో

విశాలాంధ్ర-దుర్గి : మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పల్నాడులో రక్త చరిత్ర సృష్టిస్తూ హత్యా రాజకీయాలు చేస్తున్నాడని సాక్షి పేపర్, టీవీలో ప్రచారం చేయడంను నిరసిస్తూ కూటమి నాయకులు ధ్వజమేత్తారు. మండలం కేంద్రమైన దుర్గిలో శుక్రవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో బస్టాండ్‌సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సాక్షి పేపర్‌ను చించి దగ్ధం చేశారు. నిజ నిర్ధారణ లేని ఆరోపణ లు చేయడం వైసీపీ కి తగదని విమర్శలు చేస్తూ ఖండించారు. వై సిపి అంటేనే శవ రాజకీయాలకు పెట్టిన పేరని విమర్శించారు. ఇక నుంచైనా శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. శవ రాజకీయాలు చేస్తే ముందు రోజుల్లో సాక్షిపేపర్‌కు పుట్ట గతులుండవన్నారు. ఈ కార్యక్రమంలో యేచూరిసాయి, శంకర్, లింగా రమేష్, లింగా బ్రహ్మయ్య, దొండపాటి చెన్న య్య,దుగ్గింపూడి జానకి రామ య్య,గర్నె రమేష్, పంకమళ్ళ కోటేశ్వరరావు, మాగులూరి నారయ్య, మేకల దాసు, పసు మర్తి బుజ్జి (వెంకటేశ్వర్లు), శ్రీ రామ్ కాశీ బాబు, కటకం రామారావు, సూరే రామ కృష్ణ, బొజ్జా నరసింహారావు, వెలి దండి శ్రీ నివాసరావు,పులి హరి, రుద్రాల రవి.పంతునాయక్, చింత కాయల ఆదినారాయణ, పలపాల వెంకటేశ్వర్లు గోకాని వెంకట గురవయ్య,కె. లక్ష్మీ నారాయణ. రాయపాటి సైదులు, చాట్ల దీన్నయ్య, బొల్లె ద్దుల శాంతి, సంధ్యా నాయక్, మేకల రామారావు, మేకల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రేషన్ షాపుల్లో బియ్యం : తహశీల్దార్

విశాలాంధ్ర - దుర్గి : రాష్ట్ర ప్రభుత్వం జూన్ ఒకటో తేదీ నుంచి తిరిగి డీలర్ల ఆధ్వర్యంలో రేషన్ షాపులు కొనసాగించాలని ఆదేశాలు జారీ చేయడంతో దుర్గి తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్లకు,వీఆర్వోలకు సమావేశం నిర్వహించారు. కొన్నేళ్లుగా ప్రత్యేక వాహనాల ద్వారా ఆపరేటర్స్‌తో జరుగుతున్న నిత్యావసర వస్తువుల పంపిణీ నిలిపివేసి పూర్వ పద్ధతిన ప్రారంభించే తొలిరోజు ప్రజాప్రతినిధులను,అధికార పార్టీ నేతల సమక్షంలో పండగ వాతావరణంలో కొనసాగించాలని సూచనలు చేశారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులను తెరిచి ఉంచి ప్రజా పంపిణీతో సరఫరా చేసే నిత్యావసర వస్తువులు ప్రజలకు అందించాల్సిందిగా పేర్కొన్నారు. డీలర్లు అందరూ సమయపాలన పాటించాల్సిదేనని,అలాగే నోటీస్ బోర్డులో సరుకుల వివరాలు ఎప్పటికప్పుడు పొందుపరచాల్సిందిగా ఆదేశించారు. దీనిపై ఫిర్యాదులు వస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఏపి నెంబర్ షాపు ఏఏ ప్రదేశాలలో ఉన్నాయో దండోరా వేయించాలని సూచించారు. జిల్లా స్థాయిలో రేషన్ షాపులు తనిఖీలు చేసేందుకు బృందం ఉందని జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌తో పారిశుధ్యంలో సమూల మార్పు

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల వారీగా చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ద్వారా వార్డులలో పారిశుధ్యంలో సమూల మార్పు ఉండాలని, నోడల్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ కేవీపీ కాలనీ, భాను ప్రసాద్ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీల్లో స్పెషల్ శానిటేషన్ పనులు, వెంగళాయపాలెం టిడ్కో గృహ సముదాయాలు, నల్లపాడులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్యాన్ని ప్రజలకు అందించేందుకు వార్డుల వారీగా రెగ్యులర్‌గా పనిచేసే కార్మికులు కాకుండా అదనంగా కార్మికులు, వాహనాలను కేటాయించామన్నారు. స్పెషల్ శానిటేషన్ ద్వారా ఆయా వార్డులలో ప్రజలు సంతృప్తి చెందేలా పనులు జరిగేలా నోడల్ అధికారులు, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం నల్లపాడు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. నల్లపాడు మెయిన్ రోడ్‌లో రైల్వే స్టేషన్‌కి వెళ్లే రోడ్‌లో డ్రైన్ నిర్మాణ పనులు నిలిచిపోవడం గమనించి, అధికారులను అడిగి తెలుసుకొని, వెంటనే పనులను ప్రారంభించాలని, వర్షాలు ఎక్కువగా ఉంటే సమస్య వస్తుందని అధికారులను ఆదేశించారు. వెంగళాయపాలెంలోని టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించి, తక్షణం వీధి దీపాలు ఏర్పాటుకు అంచనాలు సిద్దం చేయాలని డీఈఈని, డ్రైన్లను శుభ్రం చేయాలని, ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియర్ చేయించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో టిడ్కో ఎస్ఈ ఉమాశంకరశాస్త్రి, ఈఈ కోటేశ్వరరావు, కార్పొరేటర్ కె.గురవయ్య, జీఎంసీ డీఈఈ శ్రీనివాస్, టిడ్కో డీఈఈ సేతుబాబు, ఎస్ఎస్ రాజేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : ప్రాణాంతక హైడాటిక్ వ్యాధి బారినపడ్డ పేషంట్‌కు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)వైద్యులు అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి కాపాడారు. జీజీహెచ్ వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలుకు చెందిన ప్రసాద్ అనే పేషంట్ తీవ్రమైన కడుపునొప్పితో రెండు నెలలుగా ఇబ్బంది పడుతూ కొద్దిరోజుల క్రితం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. దీంతో జనరల్ సర్జన్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పర్యవేక్షణలో ఆ పేషంట్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి కుక్కల ద్వారా వచ్చే ప్రాణాంతకమైన హైడాటిక్ (కాలేయంలో నీటిబుడ్డ)వ్యాధిగా గుర్తించారు. ఈ వ్యాధి కుక్కల వలన కలుషితమైన నీరు తాగడం వలన లేదా సరిగా ఉడికించని మాంసం తినడం వలన ఈ వ్యాధి వస్తుందని డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటువంటి వ్యాధి సోకిన పేషంట్ ప్రసాద్‌కు విజయవంతంగా ఆపరేషన్ చేసి కాపాడినట్లు తెలిపారు. ఇటువంటి తరహా ఆపరేషన్ ఇతర కార్పొరేట్ హాస్పిటల్‌లో అయితే రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. ఆపరేషన్ అనంతరం పేషంట్ ప్రసాద్‌ను సుమారు 30 రోజులు పాటు హాస్పటల్‌లోనే ఉంచి నిరంతరం వైద్యుల బృందం పర్యవేక్షిస్తూ పేషంట్ పూర్తిగా కోలుకున్న తరువాత శుక్రవారం డిశ్చార్జ్ చేస్తున్నట్లు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. విజయవంతంగా ఆపరేషన్ చేసి పేషంట్ ప్రసాద్‌ను కాపాడిన డాక్టర్ కిరణ్ కుమార్‌కు, అతని సహచర వైద్య బృందానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందనలు తెలియజేశారు.

ఇంటి పన్నుల పెంపు సర్వేను

తక్షణమే నిలిపేయాలి : చదలవాడ

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : రాష్ట్రంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటి పన్నుల పెంపు సర్వేను తక్షణమే నిలిపేయాలని జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యాయులు డాక్టర్ చదలవాడ హరిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గర్నపూరి వినియోగదారుల సంక్షేమ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో హరిబాబు పాల్గొని మాట్లా డారు. పన్నుల పెంపు కోసం రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో నిర్వహించే సర్వేను చట్ట విరుద్ధమైన ఆస్తి విలువ ఆధారిత పన్ను విధా నాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏప్రిల్ నుంచి పెంచాలనుకున్న 15 శాతం పన్నులు తగ్గిం చాలని, అనధికార కట్టడాల పేరుతో పేద తరగతి ప్రజలపై 25 శాతం నుంచి 100 శాతం వరకు పెనాల్టీ విధింపు నిబంధనలను ఆపాలని కూటమి ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలపై 15, 485 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం నేడు 784 కోట్ల ఇంటి పన్ను పెంపు భారంతో పాటు పెంచబోయే కూటమి ప్రభుత్వం మరొకసారి పునరాలోచించాలన్నారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు బీరాల నాగేశ్వరరావు, మునిపల్లె కవిత, బెబి సరోజిని, జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యులు చేకూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో సీఓడీఈ ప్రారంభం

విశాలాంధ్ర - తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కెఫిన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ వెబెల్ యాప్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ డిజిటల్ అండ్ ఏఐ ఎక్సలెన్స్(సీఓడీఈ)ను ప్రారంభించారు. ఈ భాగస్వామ్యంతో విద్యార్థులకు ఏఐ డిజిటల్ టెక్నాలజీలపై ప్రత్యక్ష పరిశ్రమ అనుభవం లభించనుంది. ఇది విద్యా పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో కీలకమైన ముందడుగు అని వెబెల్ యాప్స్ సీఈఓ నజీష్ మీర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీఓడీఈ కేంద్రం ద్వారా విజయవాడను డిజిటల్, ఏఐ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కెఫిన్ టెక్నాలజీ గ్రూప్ సీఈఓ శ్రీకాంత్ నాదెళ్ల మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమ-రహిత శిక్షణ ఇవ్వడం ద్వారా సంస్థ వాటాదారులకు దీర్ఘకాలిక విలువను అందించగల మోడల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈలో లిస్టెడ్ సంస్థగా పేరు గాంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్ ఎంవీ నాయర్, జనరల్ అట్లాంటిక్ ఆపరేటింగ్ పార్ట్నర్ శ్రీనివాస్ పెద్దాడ, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శ్రీకాంత్ నాదెళ్ల, వెబెల్ యాప్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ నజీష్ మీర్, కేఎల్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుమన్, కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీటీఓ వెంకటగిరి వొంకయల, చీఫ్ పీపుల్ ఆఫీసర్ సుజయ్ పుత్రన్, వెబెల్ యాప్స్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భరత్ వైఎన్‌వీ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు రూపుమాపటానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - పెదకాకాని : బాల్యవివాహాలు రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెదకాకానిలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, ఫోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అదేవిధంగా చదువుకునే పిల్లలను పనులలో చేర్పించడం కూడా నేరంగా పరిగణించబడుతుందని అన్నారు. చైల్డ్ రైట్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కె.సమీర్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే చట్టప్రకారం రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని, లైంగిక దాడుల్లో గాయపడిన చిన్నారులకు ప్రభుత్వ భృతి కల్పించడంలో, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా స్వచ్ఛంద సేవా సంస్థలు, కోర్టులు కలిసి పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సీడీపీఓ ఎస్.వెంకటరమణ, సూపర్‌వైజర్ అలివేలు మంగ, కమ్యూనిటీ సోషల్ వర్కర్ అరుణ కుమారి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దర్శకేంద్రుడు దాసరికి ఘన నివాళులు

విశాలాంధ్ర - వినుకొండ : దర్శకేంద్రుడు దాసరి నారాయణరావు వర్ధంతి సందర్భంగా గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్టూడియోలో దర్శకేంద్రుడు, కళాకారులు దాసరి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించా రు. ఈ సందర్భంగా గుమ్మడి మాట్లాడుతూ. దాసరి దర్శకత్వం వహిం చిన అనేక సినిమాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఎన్నో మంచి సందే శాత్మకమైన చిత్రాలకు దర్శకత్వం వచ్చిన గొప్ప దర్శకుడు దాసరి అని వారి గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఏడుకొండలు, మందేపల్లి లక్ష్మీనర సయ్య , ముఖ్యాని వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, ముదికోటి మహేశ్వర రావు, రావిపాటి వీరయ్య, బొంకూరి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 2న పొగాకు రైతుల ధర్నా

విశాలాంధ్ర - పెదనందిపాడు : జూన్ రెండవ తేదీన పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న పొగాకు రైతుల ధర్నాను విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పాశం రామారావు కోరారు. ఆయన శుక్రవారం పెదనందిపాడు, నాగులపాడు గ్రామాలలో పలువురు రైతులను కలిసి పొగాకు నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పొగాకుకు గిట్టుబాటు ధరలేక పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట రైతు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, కన్నెగంటి చంద్రరావు, ముజావర్ లతీఫ్, నల్లమోతు రాజేంద్ర, గేరా ఏసోబు, రామినేని శ్రీనివాసరావు ఉన్నారు.

26 కంపెనీలతో మెగా ఉద్యోగ మేళా : చీఫ్ విప్ జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం వినుకొండలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న ట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి టెక్ మహీంద్రా, డైకిన్, అప్‌టెక్ సొల్యూషన్స్, అమర రాజా, ముత్తూట్ ఫైనాన్స్, హీరో మోటో కార్ప్, హెటిరో, అపెక్స్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్, ఎస్‌బీఐ కార్డు సహా 26 సంస్థల ప్రతినిధులు పాల్గొంటా రన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఎవ రైనా ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. శని వారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు మేళా కొనసాగుతుందని 18-40 ఏళ్ల లోపు నిరుద్యోగులు బయోడేటా, సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. ఐటీ, ఫైనాన్స్, పరిశ్రములు, తయారీ, సాఫ్ట్‌వేర్, రిటైల్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తార న్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం లభి స్తుందని, చదువుకున్న యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలని కోరారు. ఐదేళ్లలో రాష్ట్రం లో 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగానే వినుకొండలో ఈ ఉద్యోగ మేళా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి 6 నెలలకోసారి ఉద్యోగ మేళా పెట్టించి నిరుద్యోగు లకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు.

జూన్ 10న వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్ష ఎన్నికలు

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ నియోజకవర్గం వడ్డే ఓబన్న వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్ష ఎన్నికలు జూన్ 10వ తారీఖున నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. ఈ ఎన్నికల పోటీ నందు ఇద్దరు పోటీలో ఉన్నారు, ఒకరు బందారు. శ్రీనివాసరావు, మరొకరు చల్ల. కుమార్, పదో తారీఖున నిర్వహించే ఈ ఎన్నికలలో అధ్యక్ష ఎన్నిక తదుపరి ఐదు మండలాలు, టౌన్ అధ్యక్షుని ఎన్నుకొంటామని సంఘపెద్దలు తెలిపారు. శుక్రవారం నరసరావుపేట రోడ్డులోని వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పల్లపు వెంకటేశ్వర్లు, బత్తుల నరసింహారావు, దేవల్ల ప్రసాదు, బత్తుల బాల రాజు, మాజీ కౌన్సిలర్ కుంచాల నాగరాజు, పల్లపు పున్నయ్య, బత్తుల శ్రీనివాసరావు, బత్తుల బాలరాజు, బందారు శ్రీనివాసరావు, బత్తుల వెంకట్రావు, తమ్మిశెట్టి వెంకటస్వామి, బత్తుల సాంబ శ్రీను, తురక ఏడుకొండలు, వేముల గోవిందరాజులు, బత్తుల శ్రీను బత్తుల మహంకాళి, కొమరి వెంకట్ రాయుడు, బందారు శివయ్య, తురక రామా రావు, బందారు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - తాడేపల్లి : 15వ ఆర్థిక సంఘం రూ.989 కోట్ల నిధులను విడుదల చేయాల్సిందిగా కేంద్రం నుంచి రావాల్సిన ఎంజీఎన్ఆర్ఈజీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ నిధులను కూడా రప్పించాల్సిందిగా కోరుతూ తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిషనర్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరి షత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. గ్రామాల్లో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులతో, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్‌తో చర్చించి మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2వేల కోట్లు వరకు బకాయి ఉన్నందున అవి విడుదలయ్యేదానికి కేంద్ర మంత్రిత్వ శాఖలతో చర్చలు జరపాలని, పది రోజుల్లోగా నిధులను రాష్ట్రానికి జమ అయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం రూ.989 కోట్లు పంపి మూడు నెలలు అయిందని వాటిని కూడా త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ మాట్లాడుతూ త్వరలో నరేగా నిధులు విడుదల అయ్యేలా కమిషనర్ కృష్ణ తేజ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ కృషి చేస్తున్నారన్నారు. త్వరలోనే నిధులు విడుదలవుతాయని తెలిపారు.

హోప్‌విన్ హాస్పటల్ ఆధ్వర్యంలో 'ప్రపంచ మెనోపాజ్ హైజీన్ దినోత్సవ వేడుకలు'

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : నంబూరు నాగార్జున నగర్‌లోని జేఎంజే హైస్కూల్ ప్రాంగణంలోని ఉజ్వల సెంటర్‌లో 'ప్రపంచ మెనోపాజ్ హైజీన్ దినోత్సవ వేడుకలు' హోప్‌విన్ హాస్పిటల్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హోప్‌విన్ హాస్పిటల్స్ చైర్మన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలకు రుతుక్ర మం వల్ల వచ్చే సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు గురించి వివరించారు. అనంతరం డాక్టర్ షమ సుల్తానా ఈ సందర్భంగా మహిళలకు శానిటరీ పాడ్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో సిస్టర్ రోజలీన, వార్డెన్ మల్లేశ్వరి, టీచర్ ప్రశాంతి, హోప్‌విన్ హాస్పటల్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దీపానికి తైలం... మనిషికి యోగా

విశాలాంధ్ర - తాడేపల్లి : అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లి మహానాడులోని మానససరోవరం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో యోగా కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకమైన యోగాసనాలను ప్రదర్శించినవారికి కమిషనర్ అలీమ్ భాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల బహుమతులు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉండవల్లి సచివాలయం 2 తరుపున వివిధ ప్రాంతాలలో యోగాంధ్రా కార్యక్రమాల నిర్వహణకు కృషి చేసిన విజయశ్రీ సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, యోగా మాస్టర్ బందారు నరసింహారావును కమిషనర్ అలీమ్ భాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల ప్రశంసించారు. కాగా షార్ట్ ఫిల్మ్ మేకర్‌గా ఎన్నో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి బహుమతులు పొందటంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే కందుకూరి విశిష్ట పురస్కారం అందుకున్న రచయిత, దర్శకుడు గాదె నాగభూషణంను కమిషనర్ అలీంభాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల ప్రత్యేకంగా అభినందించారు. దీపానికి తైలం... దేపకు జలం... మనిషికి యోగా అన్న నినాదంతో యోగా ప్రాముఖ్యత గురించి ప్రచారం చేయనున్నట్లు గాదె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీ మురళి, ధ్యానగురువు, కళ్ళం రామిరెడ్డి, యోగా గురువులు ఆత్మకూరు కొండయ్య, బందారు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షా

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : గుంటూరు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎంహెచ్ఓ)కార్యాలయంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కొర్ర విజయలక్ష్మీ అధ్యక్షతన పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షకుల సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. క్షేత్రస్థాయిలో అమలు చేయబడుచున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, వాటి పని తీరు సాధించిన ప్రగతి తదితర విషయాలుపై సమీక్ష జరిగింది. రాబోయే వర్షా కాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్, కామెర్లు, అతిసార వ్యాధి సంభవించే అవకాశం ఉన్నందున సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి సకాలంలో వ్యాధులను గుర్తించి సత్వరమే నివారణ నిరోధక చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ ఆదేశించారు. వ్యాధులు సోకినప్పుడు సకాలంలో రోగులను ఆసుపత్రికి తరలించాలని, ఏ విధమైన అవాంఛనీయ ప్రాణాపాయ పరిస్థితులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల శిశు మరణాలను, మాతృ మరణాలను జరగకుండా చూడొచ్చన్నారు. పీఎంఎస్ఎంఏ ప్రతి నెల 9వ తేదీన నిర్వహించి వారికి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించాలని, గర్భిణీ స్త్రీలను తనిఖీలకు తీసుకురావడానికి..వారి ప్రాంతాలలో విడిచిపెట్టడానికి 108 వాహనాలను వినియోగించాలని పేర్కొన్నారు.

దక్షిణ భారత రాష్ట్రాల హక్కుల సాధనకై ఉద్యమించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: దక్షిణ భారత రాష్ట్రాల హక్కుల సాధనకై మేధావులు, కవులు, కళాకారులు, సకల జనులు ఉద్యమించాలని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ (డీజేఏసీ) నేషనల్ చైర్మన్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌హెచ్‌ఓ సమావేశ మం దిరంలో జరిగిన విలేకరలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షి ణాది రాష్ట్రాలపై ఉత్తరాది వారి ఆధిపత్యం ఇకనా... ఇకపై చెల్లదన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఎక్కువ పన్నులు జీఎస్టీ రూపంలో చెల్లిస్తూ దేశ ఆర్థిక వృద్ధితో దక్షిణాది రాష్ట్రాలు ముందుంటున్నాయి అన్నారు. దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధుల వాటాను ఇవ్వకుండా కేంద్ర పాలకులు పక్షపాతం వ్యవహరిస్తున్నారన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్న దేశ ప్రధానులుగా ఉత్తరాదివారే ఎక్కువ కాలం ప్రధానులుగా ఉంటున్నారన్నారు. జరగబోయే పార్లమెంట్ సీట్ల పునర్విభజన సీట్లలో జనాభా ప్రాతిపదికన చూసుకుంటే దక్షిణాది రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న 130 స్థానాల నుంచి 100 స్థానాలకు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒకే భాష, ఒకే మతం, ఒకే ఎన్నిక పేరిట హిందీ భాషను బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తుందన్నారు. మన భాష, సంస్కృతులను, దక్షిణాది రాష్ట్రాల అస్థిత్వాన్ని దెబ్బ తీసే విధంగా కుట్ర చేస్తున్నారని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టు బెంచి ఏర్పాటు చేయాలని, నీట్, నెట్, యూపీఎస్ పరీక్షల కోసం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని, నదీ జలాల సమస్యను తక్షణమే పరి ష్కరించాలని, రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీజేఏసీ రాష్ట్ర అధ్యక్షులుగా కైలా జయ సుధ దక్షణాది జాయింట్ యాక్షన్ కమిటీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులుగా కైలా జయసుధను చైర్మన్ గాలి వినోద్ కుమార్ నియమించి ఆమెకు నియా మక పత్రం అందజేశారు. ఈ సందర్భగా జయ సుధ రాష్ట్ర అధ్యక్షులుగా నియమిం చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పీవీ రమణయ్య, ఉగ్గం సాంబశివరావు, మంచాల జోసఫ్, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం సొసైటీ జనరల్ నుంచి యుఎస్ 132 మిలియన్ డాలర్ల పెట్టుబడిని పొందిన సీల్

విశాలాంధ్ర - అమరావతి : క్లీన్ ఎనర్జీ కంపెనీ అయిన సీల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధసంస్థ, ఆంధ్రప్రదేశ్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం మూడు ప్రపంచ ఆర్థిక సంస్థలు - ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ న్యూడెవలప్ మెంట్ బ్యాంక్ సొసైటీ జనరల్ నుండి మొత్తం యుఎస్ 132 మిలియన్ డాలర్ల రుణ ఆర్థికం మొత్తం పొందిందనట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీ వేలం ద్వారా ఇవ్వబడిన ఈ ప్రాజెక్టుకు ప్రతి సంస్థ యుఎస్ 44 మిలియన్ డాలర్ల ఋణ నిధులను కేటాయించిందన్నారు. ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీఈఓ లక్షిత్ అవ్లా మాట్లాడుతూ, "భారత దేశం , అతి తక్కువ కార్బన్ భవిష్యత్తుకు మారడానికి దోహదపడే పర్యావరణ అనుకూల స్వచ్ఛ ఇంధన పరిష్కారాలను అందించడానికి మేము మా ప్రయ త్నాలను కొనసాగిస్తున్నందున ఈ నిధులు సీల్ ఇం డస్ట్రీస్‌కు ఒక ప్రధాన అభివృద్ధిని సూచిస్తాయ న్నారు.భారతదేశం పునరుత్పాదక ఇంధన ఉత్ప త్తి స్వీకరణ లక్ష్యాన్ని సాధించడంలో సహాయ పడుతుంది" అని సొసైటీ జనరల్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ హిరాచంద్ అన్నారు.

అమరావతి పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు శుక్రవారం తుళ్లూరులోని సీఆర్ డీఏ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. 'మాకు కూడా మున్సిపాలిటీల కార్మికుల మాదిరిగానే సమాన వేతనం కావాలి' అని కార్మికులు నినదించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు నెల కు రూ.21 వేలు వేతనం పొందుతున్నారని, అదేవిధంగా అమరావతిలో పని చేస్తున్న తమకూ అదే వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 'ఒకే పనికి, ఒక్కో చోట వేర్వేరు జీతాలు ఎందుకు?' అని ప్రశ్నించారు. అలాగే గతంలో వారికి అం దుతున్న రూ.5 వేలు పింఛన్‌ను ఇటీవల రద్దు చేయడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పింఛన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. 'మా డిమాండ్లపై వెంటనే నిర్ణయం తీసుకోకపోతే, ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తాం' అని ఆందోళన కారులు హెచ్చరించారు. ఆందోళనకు కార్మిక సంఘాల నేతలు మద్దతు తెలిపా రు. కార్మికుల అభ్యంర్థనలను పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.

NOTICE

మహారాజశ్రీ గురజాల సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No. 01 / 2025 in O.S.No. 272 / 2018

బిట్వీన్:
దొండపాటి వెంకటేశ్వర్లు ...డి.హెచ్.ఆర్
మరియు
లింగా పిచ్చమ్మ & అదర్స్ ...జె.డి.ఆర్స్
టు,
జె.డి.ఆర్-3:లింగా మెహర్ బాబా, S/o. లేటు వెంకటేశ్వర్లు.
జె.డి.ఆర్-4:లింగా అనూష, D/o. లేటు వెంకటేశ్వర్లు.అందిరి నివాసం.డోర్.నెం.28-6-138, ముటుకూరు(పోస్ట్), దుర్గి (మం),పల్నాడు జిల్లా.

పై నెంబరు అమలులో జె.డి.ఆర్స్ 3,4 వారలకు నోటీసులు జారీచేయు నిమిత్తం కోర్టువారు ది.24-06-2025కి వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరుగారి ద్వారా గాని పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసియున్నది.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:24-06-2025

ఆచంట శ్రీనివాసరావు, డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, గురజాల(మం). పల్నాడు జిల్లా. సెల్: 9849031191

సిబార్‌లో హెచ్‌పీవీ వాక్సిన్ ఉచిత శిబిరం

విశాలాంధ్ర-పెదకాకాని : సిబార్ దంత వైద్య కళాశాలలో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచిత హెచ్‌పీవీ వాక్సిన్ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమీషన్ అధ్యక్షురాలు డాక్టర్ రాయపాటి శైలజ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డాక్టర్ నవీన గర్భాశయ క్యాన్సర్ కారకాలు, నివారణలో వాక్సిన్ పాత్రను వివరించారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించినందుకు అభినందించారు. ఖరీదైన ఈ వాక్సిన్‌ను ఉచితంగా అందించినందుకు డాక్టర్ రేవతికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలుగా నియమించబడిన డాక్టర్ రాయపాటి శైలజకు అభినందనలు తెలియజేశారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు సిబార్‌ను అభినందించారు. ఈ శిబిరంలో వందమందికి ఉచితంగా హెచ్‌పీవీ వాక్సిన్‌ను వేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కృష్ణమో హన్, జాతీయ దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై విచారణ జరిపించండి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థ పరిధిలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమా ణాలు పాటించలేదని, వీటిపై వెంటనే విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని జిల్లా జనసేన అధికార ప్రతి నిధి ఆళ్ళ హరి నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్‌ను కోరారు. ఈ మేరకు శుక్ర వారం కమిషనర్ ఛాంబర్‌లో పులి శ్రీనివాస్ కు వినతిపత్రం ఇచ్చారు. ప్రధానంగా 2021 నుండి 2024 వరకు నగరపాలక సంస్థ పాలక వర్గంలో జరిగిన అనేక పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జనసేన నగర నాయకులు మెహబుబ్ బాషా, కోలా అంజి, పడిసపోగు రమేష్, నండూరి స్వామి, మహేష్ ఉన్నారు.

దావా సమన్లు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల వారి కోర్టులో
ఒ.యస్.నెం. 41/2024

బిట్వీన్:
భూమిరెడ్డి వీరనారాయణరెడ్డి. ... వాది
మరియు
గోగిరెడ్డి శివారెడ్డి, తండ్రి.లక్ష్మారెడ్డి, సుబ్బారెడ్డి పాలెం,మాచర్ల(మం),పల్నాడుజిల్లా ...ప్రతివాది
పైనెంబరు దావాను వాది మీపై ప్రామిసరీ నోటు తాలూకు బాకీ రాబట్టుకొను నిమిత్తం దావా దాఖలు చేయగా సదరు దావా మరియు జప్తు పిటీషను ఐ.ఎ. నెం.579/2024న మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనుటకు శ్రీ కోర్టువారు ది:22-07-2025వ తేదికి వాయిదావేసినారు. సదరు వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు మీరు స్వయంగా గానీ లేక మీవకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల సదరు దావా ఒ.యస్.నెం.41/2024 మరియు జప్తు పిటీషను ఐ.ఎ.నెం.579/2024న మీపరోక్షం నందు తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 22-07-2025

చిన్నపురెడ్డి ఝాన్సీ రెడ్డి,పిటీషనరు/వాది తరపు న్యాయవాది, గురజాల, పల్నాడు జిల్లా,సెల్: 9032107117

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరు సిటీ, పట్టాభిపురం కాపురస్తులు, కొల్లా శ్యామ్ గంగాధరరావు గారి కుమారుడు విశ్వ మనోహర్ గారి సూచనలమేరకు తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి వేల్పుల శ్రీరాములు గారు ది.21-04-1977న రెండు వేరు వేరు విక్రయ దస్తావేజు నెంబర్లు 2750/1977 మరియు 2751/1977 యస్.ఆర్.ఓ. గుంటూరుగా మాకిరెడ్డి నాగేంద్రరెడ్డి వగైరాల వద్ద నుండి కొనుగోలు చేసి సర్వ హక్కులతో అనుభవించుచూ ది.01-10-2012న ఇంటస్టేట్‌గా మరణించినారు. ఆ తదుపరి సదరు ఆస్తి శ్రీరాములు గారి వారసులైన 1) వేల్పుల పుల్లమ్మ, 2) తాడిబోయిన బొల్లమ్మ, 3) వేల్పుల కృష్ణ, 4) వేల్పుల శ్రీనివాస రావు, 5) వేల్పుల చిన నాగరాజు, 6) జింకా సామ్రాజ్యం, 7) పల్లా ఆదిలక్ష్మీ గార్లకు సంక్రమించినది. అట్టి ఆస్తికి చెందిన విక్రయ ద.నెం.2750/1977 దస్తావేజులోని 4వ పేజి మరియు విక్రయు ద.నెం.2751/1977 దస్తావేజులోని 5వ పేజి పోయినవని దొరకలేదని తెలిపి నాక్లయింటుకు విక్రయించుచున్నందున దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అక్షేపణలు, లావాదేవీలు, కోర్టు జప్తులు, తనఖాలు, ఇతర క్లయిములు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 రోజులలోగా నాకు గాని, నాక్లయింటుకు గాని వ్రాతపూర్వక మైన ఆధారములతో తెలియజే యగలరు. గడువులోగా ఎటువంటి క్లయిములు వగైరాలు రాని యెడల నిష్పేచిఆస్తిగా భావించి నాక్లయింటు సదరు వేల్పుల పుల్లమ్మ వగైరల వద్ద నుండి సక్రమమైన విక్రయ దస్తావేజును పొందెదరని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, నా క్లయింటు హక్కులను గాని బైండ్ చేయజాలవు.

షెడ్యూలు:1వ అయిటం:(విక్రయ ద.నెం.2751/1977) గుంటూరు డి॥ & సబ్.డి॥,ప్రస్తుతం: పెదకాకాని సబ్ డి॥, యిలాకా, వెనిగండ్ల గ్రామం తాలూకు డి.నెం.209-4రు దాఖలా య.0-64 సెంట్ల భూమికి హద్దులు :తూర్పు : వేల్పుల సింహాద్రి గారి భూమిహద్దు, దక్షిణం:ముత్యాల ఏసుబాబు గారి భూమి హద్దు,పడమర:గుమ్మా ఆదివిష్ణు గారి భూమి హద్దు,ఉత్తరం: చిన్ని సాంబ గారి భూమి హద్దు.

2వ అయిటం:(విక్రయ ద.నెం.2750/1977)గుంటూరు డి॥ & సబ్.డి॥, ప్రస్తుతం: పెదకాకాని సబ్ డి॥,యిలాకా వెనిగండ్ల గ్రామ డి.నెం.206/1రు.య.0-41సెంట్లు మింజుమలె య.0-20.1/2 సెంట్లు భూమి అడంగల్, 1బి నమూనా దాఖలా వెనిగండ్ల గ్రామం తాలూకు డి.నెం.206-1-ఎరు య.0-20 సెంట్లు భూమికి హద్దులు :తూర్పు :కొండా గోపిరెడ్డి గారి భూమి హద్దు, దక్షిణం: కొండమడుగుల కోటిరెడ్డి గారి తాలూకు యీ నెంబరులోని భూమి హద్దు,పడమర:కొండమూడి పేరయ్య వగైరాల భూమి హద్దు,ఉత్తరం:సర్కారు పంట కాలువ హద్దు.

కె.యస్.యం. కిషోర్, అడ్వకేట్
3వ లైను, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. సెల్ : 9848570106

ఆసియా క్రీడల్లో రన్నర్ రజతకు స్వర్ణం

విశాలాంధ్ర - అమరావతి : ఏపీ ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ క్రీడాకారిణి కుంజా రజిత ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో మరో స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. దక్షిణ కొరియాలోని గూమి నగరంలో గురువారం జరిగిన 26వ ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో భారత్ తర పున 400 మీటర్ల రిలే పరుగు జట్టులో పాల్గొ ని అత్యుత్తమ ప్రతి భను కనబరిచింది. ఫలితంగా భారత్ రిలే పరుగు జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పత కాన్ని దక్కించుకుంది. అంతర్జాతీయ స్థాయి భారత్ మహిళా రన్నర్లు జిస్నా మ్యాథ్యూ, రూప చౌదరి, సుభ వెంకటేషనులతో కూడిన 400 మీటర్ల రిలే పరుగు జట్టు లో రజిత పాల్గొంది. ఈ జట్టు 3.34 సెకన్ల వ్యవధిలో నిర్ణీత దూరాన్ని చేరుకొని ఫైనల్స్‌లో వియత్నాం శ్రీలంక జట్లను అధిగమించింది. ఈ సందర్భంగా రజితను యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్య నారాయణన్ అభినందించారు. అంతర్జాతీయ క్రీడ ల్లో రజిత చూపి న ప్రతిభ దేశ ప్రతిష్టని కాకుండా యూనివర్సిటీ కీర్తిని మరింత ఇనుమడింప చేసిందని వైస్ ఛాన్సర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా పేర్కొన్నారు. రజితలోని కృషి పట్టుదల అంకితభావం ఆమె ను విజయతీరాలకు చేర్చాయని ప్రో వైస్ ఛాన్సర్ డాక్టర్ సతీష్ కుమార్ ప్రశంసించారు. స్పోర్ట్స్ డైరెక్టర్స్ అనూప్ సింగ్ సూర్య వంశ, సుస్మితా సింగ్, శ్రీపతి లతో పాటు పలువురు యూనివర్సిటీ ప్రముఖులు రజితకు శుభాకాంక్షలు తెలిపారు.

CRANE INFRASTRUCTURE LIMITED
CIN NO : L45209AP2008PLC059135 Website: www.cranegroup.in
D.No. 25-18-54,OPP.Crane Betel Nut Powder Works Office, Main Road, Sampath Nagar, GUNTUR. Ph.: 0863-2223311

STATEMENT OF AUDITED FINANCIAL RESULTS FOR THE 4TH QUARTER AND FINANCIAL YEAR ENDED ON 31-03-2025 (Rs. in Lakhs)

Sl. No.	Particulars	Quarter Ended 31-03-2025 (Audited)	Quarter Ended 31-12-2024 (Unaudited)	Quarter Ended 31-03-2024 (Audited)	Year Ended 31-03-2025 (Audited)	Year Ended 31-03-2024 (Audited)
1	Total Income from Operations	35.30	35.30	51.08	137.15	355.39
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and/or Extraordinary items)	28.90	10.02	41.05	85.04	187.13
3	Net Profit / (Loss) for the period before tax (after Exceptional and/or Extraordinary items)	28.90	10.02	41.05	85.04	187.13
4	Net Profit / (Loss) for the period after tax (after Exceptional and/or Extraordinary items)	23.33	5.32	33.73	66.36	144.97
5	Total Comprehensive Income for the period [Comprising Profit / (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	23.33	5.32	33.73	66.36	144.97
6	Equity Share Capital	724.20	724.20	724.20	724.20	724.20
7	Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance Sheet of the previous year	649.05	625.72	582.69	649.05	582.69
8	Earnings Per Share (of Rs.10/- each) (for Continuing and discontinued operations) - Basic: Diluted:	0.32 0.32	0.07 0.07	0.47 0.47	0.92 0.92	2.00 2.00

Note : 1) The results for the quarter ended March 31, 2025 were recommended by the audit committee and approved by the Board of Directors in its meeting held on 29-May-2025. The above results for the quarter and 12 months ended March, 2025 have been reviewed by the statutory auditors of the company in terms of Regulation 33 of the SEBI (Listing obligations and Disclosure Requirements) Regulations, 2015. However, the Company's Management has excercised necessary due deligence to ensure that the financial results provide a true and fair view of its affairs.
2) The format for un-audited quarterly results as prescribed in SEBI's Circular CIR/CFD/CMD/15/2015 dated: November 30, 2015 has been modified to comply with requirements of SEBI's circular dated July 5, 2016 IND AS and schedule III, (Divison II) to the Companies Act, 2013 applicable to companies that are required to comply with IND AS.
3) Previous period figures are re-arranged/ re-grouped wherever necessary
4) The detailed above said financial results is also available on the website: https://craneinfrastructure.com

Place : GUNTUR
Date : 30-05-2025

By order of the Board
Sd/- K.PRAVEEN
(Executive Director)

Scan this QR Code for viewing full Financial Report.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు సిటీ, రాజీవ్ గాంధీనగర్ 9వ లైను, డోర్.నెం.6-7-846/166ఎ కాపురస్తురాలు పిడతల విజయనిర్మల,W/o. రవికుమార్ గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, మాక్లయింటు ది.19-04-2015న విక్రయ దస్తావేజు నెం. 2083 /2017 యస్.ఆర్.ఓ. నల్లపాడు ద్వారా గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి॥, జి.యం.సి. ఏరియాలో చేరిన పొత్తూరు గ్రామ డి.నెం.454/3-డి/3 య.2-60సెంట్లు మింజుమలె చ.గ.109-50 నివేశన స్థలమును కొనుగోలుచేసి సర్వ హక్కులతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్తికి చెందిన పై తెలిపిన ఒరిజినల్ విక్రయ ద.నెం. 2083/2017 మరియు దాని ఒరిజినల్ లింకు విక్రయ ద.నెం.6085/2015లను తీసుకొని గుంటూరు మున్సిపల్ ఆఫీసు నందు పని నిమిత్తం ది.12-05-2025న వచ్చి అక్కడ పని ముగిసిన తరుపాత ఇంటికి వెళ్ళు తొందరలో మున్సిపల్ కార్పోరేషన్ పరిసరాలలో సదరు పై తెలిపిన డాక్యుమెంట్లను పోగొట్టుకున్నది.కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికినయెడల మాకుగాని, మా క్లయింటుకు గాని అందజేయగలరు. అట్లు గాక సదరు పై తెలిపిన రెండు ఒరిజినల్ దస్తావేజులను ఎవరైనా దుర్వినియోగ పరచినయెడల మా క్లయింటు తీసుకొను సివిల్ & క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

చంద్రగిరి బాబూరావు, ఏ. వీరా రెడ్డి, న్యాయవాదులు
ఫ్లాట్ నెం.401, కాంచన టవర్స్, పట్టాభిపురం మెయిన్‌రోడ్, గుంటూరు. సెల్ : 9441753067

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - మంగళగిరి : నిరుపేద ప్రజలకు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణా నికి రూ.5 లక్షలు ఇవ్వా లని సీపీఐ నాయకులు కోరారు. పట్టణంలోని కొత్తపేటలో ఇళ్ళు లేని నిరుపేద ప్రజలకు పట్ట ణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇవ్వాలని కోరుతూ అర్జీలను పూర్తిచేసే కార్యక్రమాన్ని శుక్రవారం సీపీఐ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇచ్చి వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సందర్భంగా మంగళగిరి నియోజకవర్గంలో నిరుపేద లకు ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న ఇళ్ల పట్టాలు లేని వారికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని చిన్ని, అన్నవరపు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కొత్తపేట శాఖ కార్యదర్శి వల్లభాపురం నాగేశ్వరరావు, షేక్ సుభాని, పాలెం నాసరయ్య పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు : సీపీఐ

విశాలాంధ్ర- తాడేపల్లి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్య దర్శి కంచర్ల కాశయ్య, కోరారు. సీపీఐ రాష్ట్ర పిలుపులో భాగంగా జూన్ 2వ తేదీన జరగనున్న ధర్నాకి సంబంధించిన గోడపత్రికను శుక్రవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయం(నీలం రాజశేఖర్ రెడ్డి భవన్)లో సీపీఐ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య మాట్లాడుతూ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు వెంటనే మంజూరు చేసి పేదలను ఆదుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయా లని అన్నారు. సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంక టయ్య మాట్లాడుతూ జూన్ రెండవ తేదీన మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఇల్లు లేని నిరుపేదల నుంచి అర్జీలను స్వీకరించి పేదలతో కలిసి ఎంపీఎంసీ కమిషనర్‌కి అర్జీలు సమర్పించనున్నట్లు తెలిపారు. రెండవ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుంటక సాంబిరెడ్డి, షేక్ బాషా, బుర్రముక్కు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, సీతారామయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఐక్యతే ఆయుధంగా ముందుకు సాగుదాం

- అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపు

విశాలాంధ్ర - తాడేపల్లి : ఐక్యతే ఆయుధంగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ముందుకు సాగాలని, అందుకు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్‌లన్నీ మద్దతుగా నిలుస్తాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య చెప్పారు. సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌ ట్‌కు గురై శుక్రవారం నాటికి 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్మిక కుటుంబాలు పెద్దఎత్తున దీక్ష శిబిరం వద్దకు నల్లబ్యాడ్జీలు ధరించి తరలివచ్చారు. దీక్షలను సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య ప్రారం భించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ దీక్షలో వై.రమాదేవి, ఎస్కే ఏమాంబి, జి.మరియమ్మ, శివకుమారి, చారమ్మ, టి.దుర్గా భవాని, కె.మోహన్‌రావు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో బి.సూర్యప్రకాష్ రావు, వై.సాంబశివరావు, సుభాని, ఆసిఫ్, డి.నాగేశ్వరరావు, ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరరావు, బి.అంకయ్య, ఎన్.దుర్గారావు, కె.మేరీ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో నారాయణలో తరగతుల నిర్వహణ

- కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర - గుంటూరు కలెక్టరేట్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లం ఘిస్తూ వేసవి సెలవుల్లో తర గతులు నిర్వహిస్తున్న నారా యణ కళాశాల అమ రావతి రోడ్ క్యాంపస్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.యశ్వంత్ రఘువీర్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఇంటర్‌మీడి యట్ మొద టి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గుంటూరు నగరంలోని అమరావతి రోడ్డులో ఉన్న నారాయణ కళాశాల యాజమాన్యం తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని తెలు సుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకత్వం శుక్రవారం అక్కడకు చేరు కుని తరగతులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ సెలవుల్లో అక్రమంగా తరగతులు నిర్వహిస్తూ విద్యా ర్థులను మానసికంగా ఇబ్బందులకు గురిచే యడం తగదని అన్నారు. ఒకపక్క ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అకడ మిక్ సంవత్సరం ప్రారంభించాకే జూన్ నుంచి కళాశాలు పునఃప్రారం భించాలని జీఓలు తెస్తున్న కొన్ని కార్పొ రేట్ విద్యాసంస్థలు ప్రభు త్వ నిబంధనలు పాటించకుండా బ్రిడ్జి కోర్సులు, తరగతులు నిర్వహిస్తున్నారని మండి పడ్డారు. తక్షణమే ఇటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో జిల్లా విద్యాశాఖ కార్యా లయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి ప్రణీత్, నాయకులు అజయ్, వెంకట్, తేజ, వంశీ, దేవేంద్ర, సాయి గణేష్, రాహుల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన చరిత్ర కమ్యూనిస్టులదే

- పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర - వినుకొండ : భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ఎందరో అమరవీరులు ప్రజల కోసం తమ విలువైన ప్రాణాలను బలిదానం చేసిన చరిత్ర ఎర్రజెండా దని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని ఒకటో వార్డు వెన్న పూస కాలనీలో శుక్రవారం జరిగిన శాఖా సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కమ్యూనిస్టు పార్టీ స్వాతం త్ర్యం అనంతరం దేశంలోని అట్టడుగు వర్గాలు దళిత బలహీన వర్గాల అభ్యున్నతికి కార్మిక కర్షక వర్గాల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిం దన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఎన్నిక లప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిం చిందని రాష్ట్రానికి ప్రత్యేక హోదా కానీ ప్రత్యేక ప్యాకేజీ గానీ ఇవ్వకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిని దెబ్బ తీసి ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఇటీవ ల రాష్ట్రానికి వచ్చిన మోడీ రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకొని నిర్మిం చ తలపెట్టిన వివిధ సంస్థ లకు శంకుస్థాపనలు చేశారు కానీ కేంద్రం నుండి రాష్ట్రా నికి ఇచ్చే నిధులు ఏమాత్రం ప్రకటించలేదని ఆయన విమర్శించారు. సిపిఐ నియోజక వర్గ కార్య దర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాములు మాట్లాడుతూ ఎన్నికల సమ యంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెర వేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ మహా సభల షెడ్యూల్ ప్రకటించినందున దేశంలోని పార్టీ గ్రామీణ శాఖల నుండి మండల పట్టణ నియోజక వర్గ జిల్లా రాష్ట్ర మహాసభలన్నీ నిర్వహించుకోవలసి ఉన్నదని అందులో భాగంగానే ఈ శాఖ సమావేశం జరుగుతోం దన్నారు. ఈ సమావేశానికి నలబోతు శ్రీను అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, మండల కార్యదర్శి రాయబారం వందనం, పిన్ని బోయిన వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జున, తిరుమల కోటి లింగం, కోటి తిరుమల తిరుపాలు గాదం రంగయ్య తిరు మల, దిబ్బ మ్మ నలబోతు బుజ్జమ్మ, మరియమ్మ, యోగమ్మ, రంగమ్మ, కుమారి ,గురవమ్మ మార్కు, నాగమణి, పద్మ, భూషయ్య, రాజేశ్వరి, భూలక్ష్మి, కనకమ్మ పాల్గొన్నారు. సమావేశం అనంతరం మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నది కార్యదర్శిగా-నల్లబోతు శ్రీనివాస రావు సహాయ కార్యదర్శులుగా తిరుమల శ్రీను, నల్లబోతు రంగయ్య, తిరుమల హనుమాయమ్మ, తిరుమల రూతమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీఆర్‌డీఏ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

విశాలాంధ్ర- తుళ్లూరు : రాజధాని ప్రాంత రైతులు తుళ్లూరులోని సీఆర్ డీఏ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఆందోళనకు ది గారు. శుక్ర వారం గ్రీవెన్స్ డేను పురస్కరించుకుని తమ సమ స్యల పరిష్కారంపై అధికారులను కలిసేందుకు కార్యాలయంకు వచ్చారు. రాజ ధానిలో ఈ-5 రోడ్డు నిర్మాణం వల్ల ఇళ్ళు, స్థలా లు కోల్పోతున్నామని, తమకు న్యాయం చేయాలని కోరేందుకు అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్‌ను కలిసేం దుకు ప్రయత్నించగా కొందరు అధికారులు అడ్డుకున్నారు. నలుగురు మాత్రమే రావాలని అనడంతో రైతులకు, అధికారు లకు మధ్య వాగ్వివాదం జరిగింది. రోడ్డు నిర్మాణం కారణంగా తమ ఇళ్లు, స్థలాలు కోల్పో తున్నామని, పునరావాసానికి సం బంధించి ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత లేదని రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్ జోక్యం చేసుకున్నారు. వీలైనంత త్వరగా పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశం

విశాలాంధ్ర- గుం టూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉప్పల పాడు పక్షుల కేంద్రాన్ని కన్జర్వేషన్ రిజ ర్వుగా, సిరిపురంలోని మం చినీటి చెరువును చిత్తడి నేలగా నోటిఫై చేస్తూ నిర్దేశిత మార్గ దర్శకాలు ప్రకారం ప్రతిపాదన సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అటవీ శాఖ అధికారులను ఆదే శిం చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సంయుక్త కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అధ్యక్షతన జిల్లా చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఎజెండాకు సంబంధించి పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం కన్జర్వేషన్ రిజర్వుగా, మేడికొం డూరు మండలం సిరిపురం గ్రామంలోని మంచినీటి చెరువును చిత్తడి నేలగా ప్రకటించడానికి నిర్వహించిన గ్రామ సభలు, నిబంధన వివరా లను జిల్లా అటవీశాఖ అధికారి ఎం.హిమ శైలజ సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సాయికు మార్, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, పొల్యూ షన్ కం ట్రోల్ బోర్డు ఈఈ నజీమా బేగం, పెదకాకాని తహశీల్దార్ కృష్ణకాంత్, మండల సర్వేయర్ ఆంజనేయులు, ఈఓపీఆర్డీ శ్రీనివా సులు, మేడికొండూరు ఎంపీడీఓ తోట చందన, ఎఫ్ఆర్ఓ పోతురాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హారిక, ఉప్పలపాడు సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, ఈడీసీ ఛైర్మన్ హరిబాబు, వైస్ ఛైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

విశాలాంధ్ర దినపత్రికకు కృష్ణాజిల్లాలో
దిగువ పేర్కొన్న మండలాల్లో పనిచేయుటకు
విలేకరులు కావలెను

ఇంటర్మీడియట్ చదివి తెలుగు భాషా పరిజ్ఞానం కలిగి సామాజిక,
రాజకీయ అంశాలపై అవగాహన ఉన్న అభ్యర్థులు అర్హులు

పనిచేయవలసిన మండలాలు :
మచిలీపట్నం టౌన్, బాపులపాడు, కోడూరు, గూడూరు, నాగాయలంక,
నందివాడ, తోట్లవల్లూరు, ఉంగుటూరు, హనుమాన్ జంక్షన్

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ : 8074662146, 9490338489

గమనిక : ఆయా ప్రదేశాలల్లో స్థానికులై ఉండాలి

విశాలాంధ్ర జిల్లా కార్యాలయం
ఈడేపల్లి, ఆంజనేయస్వామి గుడి ఎదుట, మచిలీపట్నం